జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | బుధవారం 30 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 231 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## రాజధానిలో మరిన్ని భూముల
# సమీకరణ



- ఎయిర్‌పోర్టు, క్రికెట్ స్టేడియం కోసం మరికొంత భూమి అవసరం
- వీటి అవసరాలకు అనుగుణంగా భూమిని తీసుకోవాల్సి ఉంటుంది
- వీటి నిర్మాణంతో భూముల విలువ పెరుగుతుంది
- రాజధాని పనుల పున:ప్రారంభ కార్యక్రమానికి రైతులకు ఆహ్వానం
- రైతుల రిటర్న్‌బుల్ ప్లాట్లకు బ్యాంకుల ద్వారా రుణాలు
- గ్రామకంఠం పరిధిలో పట్టాలేని వారికి పట్టాలు మంజూరు
- త్యాగాలు చేసిన రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ కార్యక్రమమూ ఉండదు

**అమరావతి:**

రాజధానిలో మరిన్ని భూములు సమీకరించాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రికెట్ స్టేడియం నిర్మాణాలకు మరికొంత భూమి అవసరం అని.. దీనికి అనుగుణంగా తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. "హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూ సేకరణ జరిగినప్పుడు 5 వేల ఎకరాలు ఎందుకని కొందరు ప్రశ్నించారు. కానీ, నాడు ముందుచూపుతో సేకరించినందునే ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణంతో పాటు పెద్ద హోటళ్లు, మాల్స్ వచ్చి ఎకనమిక్ యాక్టివిటీ పెరిగింది. చుట్టుపక్కల భూములకు విలువ పెరిగి రైతులకు మేలు చేకూరింది" అని అన్నారు. అమరావతి రైతులతో సీఎం తన నివాసంలో సమావేశమయ్యారు. రాజధాని - మిగతా 3లో

## యుద్ధ పరిస్థితులు వచ్చినా
# సిద్ధంగా ఉండాలి



- పాక్‌కు అనుకూలంగా మాట్లాడితే అక్కడికే వెళ్లిపోండి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- కాల్చుకుంటూ పోతే చూస్తూ ఊరుకోవాలా..
- అతిమంచితనం వద్దు
- మత కలహాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలి
- ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలి

**అమరావతి**

జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో అమరవీరులకు జనసేన సంతాపం ప్రకటించింది. మంగళగిరిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు నేతలు మౌనం పాటించారు. ఉగ్రదాడి మృతులకు డిప్యూటీ సీఎం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అమాయకులను అత్యంత దారుణంగా చంపారన్నారు. ఉగ్రదాడి ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసిందని.. పహల్గామ్ ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయని తెలిపారు. - మిగతా 3లో



## పాక్‌ను దెబ్బకు దెబ్బ తీయాలి

- ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం
- ఒకవేళ పాక్ కవ్వింపులకు పాల్పడితే రక్షణ పరంగా ఎలా తిప్పికొట్టాలి
- ఓ వైపు రక్షణ పరంగా దెబ్బకొడుతూనే.. దౌత్య పరంగా ప్రపంచ దేశాల ఎదుట పాకిస్తాన్‌ను ఇరుకున పెట్టేలా ఎలా దెబ్బకు దెబ్బ తీయాలి

## ప్రజా సమస్యల పరిష్కారానికి
# అసెంబ్లీ కమిటీ

- ప్రజా ఫిర్యాదులపై ఈ శాసనసభ కమిటీ మొదటి సమావేశం విశాఖలో ఏర్పాటు చేశామని ఆ కమిటీ విధి విధానాలపై ప్రజలు, ఎమ్మెల్యేలకు కూడా అవగాహన లేదు
- ఈ కమిటీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మీడియా ముందుకు వచ్చాం
- ఏ ఫిర్యాదు నైనా శాసనసభ్యుల ద్వారా రిఫర్ చేయాలి



**విశాఖపట్నం**

ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు తెలిపారు. విశాఖపట్నం లో మంగళవారం అసెంబ్లీ పిటిషన్ కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఆ కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావు, జగన్మోహన్, కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు మీడియాతో - మిగతా 3లో



## పహల్గాం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం

- కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగం కల్పిస్తాం
- ఉగదాడి మృతుడు సంతోష్ జగదలే కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయించింది.
- జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

# మీరే పార్టీ.. పార్టీయే మీరు

- ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత
- గొంతులేని వారికి బాసటగా నిల్చేది మనమే
- ప్రభుత్వ అవినీతిపై ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులకు జగన్ పిలుపు

**అమరావతి**

రాష్ట్రంలో యథేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, ఎక్కడికక్కడ అంతులేని అవినీతి జరుగుతోందని, వాటన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదని, విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లోనూ విధ్వంసమే కొనసాగుతోందని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో వైయస్ జగన్ గుర్తు చేశారు. ఈ సందర్భంగా జగన్ ఏమన్నారంటే.. ప్రజలకు అండగా పలు కార్యక్రమాలు చేయాలి. ఆ కార్యక్రమాలు రాష్ట్ర స్థాయి దష్టిని కూడా ఆకర్షిస్తాయి. ఇంకా వాటి ద్వారానే మీ పనితీరు కూడా బయట పడుతుంది. ఈ ప్రక్రియలో పార్టీ జిల్లా అధ్యక్షులది చాలా కీలక బాధ్యత. సమాజంలో - మిగతా 3లో






## ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడీకి చెక్

- చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- స్కూళ్లలో ఫీజులు ఎంత మేరకు ఉండాలనే అంశంపై ప్రభుత్వం విధివిధానాలు ఖరారు
- ఢిల్లీ ప్రభుత్వం చారిత్రాత్మక,సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది
- ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు- 2025 ముసాయిదా బిల్లును ఈరోజు కేబినెట్ ఆమోదించిందని మీకు చెప్పడానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను : ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

# ఎంట్రీ, ఎగ్జిట్ రూట్స్‌ను బ్లాక్ చేసి..

# ఎన్ఐఏ దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు



పెహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తును ముమ్మరం చేసింది. లోకల్ ఫొటోగ్రాఫర్లు, దుకాణదారులు, డ్రైవర్లను ఇలా దాదాపు 45 మంది ప్రత్యక్ష సాక్షులను పిలిచి విచారించింది. ఈ సందర్భంగా వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. బైసరాన్ లోయలో సందర్శకులు తప్పించుకునేందుకు వీల్లేకుండా ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను ఉగ్రవాదులు బ్లాక్ చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తమ వాంగ్మూలంలో తెలిపారు. ఇద్దరు ఉగ్రవాదులు ఎంట్రీ గేటు నుంచి లోపలికి ప్రవేశించినట్లు చెప్పారు. మరో ఉగ్రవాది ఎగ్జిట్ గేటు వద్ద ఎవరినీ బయటకు వెళ్లనీకుండా కాపలా కాసినట్లు తెలిపారు. తొలిసారి కాల్పులు మొదలైంది ఎగ్జిట్ గేటు వద్దే అని వివరించారు. దీంతో సందర్శకులు భయంతో ఎంట్రీ గేటువైపు పరుగులు తీయగా.. అక్కడ ఉన్న ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పేర్కొన్నారు. ముందుగా ప్రవేశ ద్వారం వద్దకు వెళ్లిన టూరిస్ట్‌లను మహిళలు, పురుషులు రెండుగా విడిపోవాలని ఉగ్రవాదులు ఆదేశించారు. అయితే, అందుకు వారు నిరాకరించడంతో.. హిందూ, ముస్లింలు వేరు కావాలని చెప్పారు. అందుకు కూడా సందర్శకులు నిరాకరించారు. దీంతో వారు వరుసగా దాడులకు పాల్పడ్డారు. ఇక కాల్పులు జరిపే ముందు పర్యాటకులను కల్మా పఠించాలని కోరారు. కల్మా పఠించిన వారిని ఉగ్రవాదులు వదిలిపెట్టారు. ఇక ప్రవేశ ద్వారం నుంచి వచ్చిన నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్.. ఉగ్రవాదుల కాల్పులకు గురైన మొదటి వ్యక్తి. టూరిస్ట్ స్పాట్‌లోని టీ స్టాల్, ఫుడ్ స్టాల్ ప్రాంత సమీపంలోనే అత్యధికంగా ప్రాణ నష్టం జరిగింది. దాడి అనంతరం ముగ్గురు ఉగ్రవాదులు సమీపంలోని అడవిలోకి పారిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు తమ వాంగ్మూలంలో తెలిపారు. ఇక మరో ఉగ్రవాది దాడిలోపాల్గొన్న వారికి రక్షణ కల్పించేందుకు సమీపంలోని అడవిలో దాక్కొని ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరు ముష్కరులు సైనిక దుస్తులు ధరించగా.. ఒకరు సంప్రదాయ కశ్మీరీ డ్రెస్‌లో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తమ వాంగ్మూలంలో వెల్లడించారు.

# కశ్మీర్‌లో స్లీపర్‌సెల్స్ యాక్టివ్.. ఇంటెలిజెన్స్ హెచ్చరిక





శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం దాడి ఘటనతో అక్కడ భారత ఆర్మీ హైఅలర్ట్‌లో ఉంది. మరోవైపు.. కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో 48 టూరిస్టు కేంద్రాలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం మూసివేసింది. వివరాల ప్రకారం.. పహల్గాం దాడి అనంతరం కశ్మీర? లోయలో స్లీపర్‌సెల్స్ యాక్టివేట్ అయినట్లు నిఘావర్గాలు తెలిపాయి. దీంతో, కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. అనంతరం, కశ్మీర్‌లో ఉన్న 48 టూరిస్టు కేంద్రాలను ప్రభుత్వం మూసివేసింది. కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న మొత్తం 87 టూరిస్టు కేంద్రాల్లో వీటిని మూసివేస్తున్నట్లు పేర్కొన్న అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. పహల్గాం ఉగ్రదాడి ఘటనపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులను పాశవికంగా హతమార్చిన ఘటనపై చర్చించేందుకు జమ్ముకశ్మీర్ శాసనసభ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఉగ్రదాడి మృతులకు సంతాపసూచకంగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించింది. పాశవికదాడిపై తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేస్తూ ఏకగ్రీవంగా ఓ తీర్మానాన్ని ఆమోదించింది.

**కశ్మీర్లో 48 టూరిస్ట్ 4 ప్రాంతాల మూసివేత**

దానికి ముందు సీఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. 'బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. పహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టుకొని రాష్ట్ర హోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదు. గతంలో రాష్ట్ర హోదా అడిగాం.. భవిష్యత్తులో కూడా అడుగుతాం. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు. ప్రజలు మాకు మద్దతు ఇస్తే.. ఉగ్రవాదం అంతమవుతుంది' అని పేర్కొన్నారు.

# సింధూ జలాల ఒప్పందం రద్దుతో..

# చీనాబ్ నదిలో పాకిస్థాన్‌కు తగ్గిన నీటి ప్రవాహం




న్యూఢిల్లీ: పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీని ఫలితంగా చీనాబ్ నదిలో నీటి ప్రవాహం తగ్గినట్లు గుర్తిస్తున్నారు. శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. ఇండియా నుంచి పాకిస్థాన్‌లోకి చీనాట్ నది ప్రవహిస్తుంది. పాకిస్తాన్‌లోని సియాల్‌కోట్ వద్ద ఉన్న మరలా హెడ్‌వర్క్స్ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని శాటిలైట్ చిత్రాల ద్వారా పసికట్టారు. ఒప్పందాన్ని సస్పెండ్ చేయడానికి ముందు ఏప్రిల్ 21వ తేదీన ఉన్న నీటి స్థాయిని, ఆ తర్వాత ఏప్రిల్ 26వ తేదీన బ్యారేజీ వద్ద ఉన్న నీటి స్థాయిని శాటిలైట్ చిత్రాల ద్వారా రిలీజ్ చేశారు. ఏప్రిల్ 26 తర్వాత బ్యారేజ్ వద్ద ఎక్కువగా బురుద, రాళ్లు పేరుకుపోయినట్లు గుర్తించారు. మరలా హెడ్‌వర్క్స్ వద్ద కొన్ని ప్రాంతాల్లో నీటి స్థాయి పూర్తిగా పడిపోయిందని, శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం స్పష్టం అవుతున్నట్లు కల్నల్ వినాయక్ భట్ తెలిపారు. శాటిలైట్ చిత్రాలను విశ్లేషించే ఆయన వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన తర్వాత ఇండియాలో చీనాబ్ నది నీటి స్టోరేజీ పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. చంద్ర, భాగా నదులు కలిసిన తర్వాత చీనాబ్ నదిగా మారుతుంది. మనాలీ, లేహ్ రూట్లో ఉన్న బరాలాచా లా పాస్ వద్ద ఆ నదులు కలుస్తాయి. చంబా మీదుగా నార్త్ వెస్ట్ రూట్లో చీనాబ్ నీరు జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశిస్తుంది. కిస్త్వార్, దోడా, రాంబన్, రియాసీ, జమ్మూ జిల్లాల మీదుగా ఆ నది ప్రవహిస్తుంది. ఆ తర్వాత పాకిస్థాన్‌లోని బవల్‌పుర్‌లో సట్లజ్ నదిలో కలుస్తుంది. ఈ నదిపై హైడ్రో పవర్‌ను అధిక స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. భారత్ వైపునే సుమారు ఏడు వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. పాకిస్థాన్ వైపు చీనాబ్ నదిపై ఉన్న మరలా హెడ్‌వర్క్స్ బ్యారేజీ.. ఆక్నూర్ సెక్టార్‌లోని అంతర్జాతీయ బోర్డర్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీనిపై ప్రధానంగా రెండు ఇరిగేషన్ లింకు కెనాల్స్ ఉన్నాయి. మరలా-రావి లింక్ కింద సుమారు 22 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. ఇక బంబన్‌వాలా-రావి-బెడియాన్-దీపాల్‌పుర్ కెనాల్ కింద సుమారు 4200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. ఈ కెనాల్‌నే ఇచోగిల్ కెనాల్ అని కూడా పిలుస్తారు. హెడ్‌వర్క్స్, ఎంఆర్ఎల్ బ్యారేజీలను బ్రిటీష్ కాలంలో నిర్మించారు. 1906 నుంచి 1912 మధ్యలో వీటిని కట్టారు. పాకిస్థాన్‌లో ఉన్న గుర్జన్‌వాలా ప్రాంతానికి నీరు వెళ్తుంది. ఇక్కడ ప్రవహించే నీటికి మిలిటరీ ప్రాముఖ్యత కూడా ఉంటుంది. పాకిస్థాన్‌లో ఉన్న ఎక్కువ ఆర్మీ యూనిట్లు అన్నీ ఇక్కడ కెనాల్స్‌పై ఆధారపడుతుంటాయని రక్షణశాఖ నిపుణులు వెల్లడిస్తున్నారు. నీటి ప్రవాహం తగ్గడం వల్ల అది సైనిక సత్తాపై నేరుగా ప్రభావం పడే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

## పాక్‌ను దెబ్బకు దెబ్బ తీయాలి



**ఢిల్లీ:** పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో కీలక సమావేశం ప్రారంభమైంది. మంగళవారం ప్రధాని మోదీ నివాసంలో ప్రారంభమైన ఈ సమావేశానికి త్రివిధ దళాదిపతులు హజరయ్యారు. వీరితో పాటు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్, సీడీఎస్ అనీల్ చౌహాన్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గత బుధవారం భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయి. భద్రతా బలగాల మొహరింపు వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు త్వరలో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్రలో పాక్ కవ్వింపులు చర్యలకు పాల్పడితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఒకవేళ పాక్ కవ్వింపులకు పాల్పడితే రక్షణ పరంగా ఎలా తిప్పికొట్టాలి. ఓ వైపు రక్షణ పరంగా దెబ్బకొడుతూనే.. దౌత్య పరంగా ప్రపంచ దేశాల ఎదుట పాకిస్తాన్‌ను ఇరుకున పెట్టేలా ఎలా దెబ్బకు దెబ్బ తీయాలనే తదితర అంశాలపై ప్రముఖంగా చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## పహల్గాం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం



**ముంబై:** పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మహారాష్ట్రకు చెందిన 6 కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మంగళవారంనాడు ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సాయం ఇస్తామని, వారి పిల్లల చదువులు, కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. దేవేంద్ర ఫడ్నవిస్ అధ్యక్షతన మంగళవారంనాడిక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశంలో పహల్గాం మృతుల కుటుంబాలకు తొలుత సంతాపం ప్రకటించారు. అనంతరం మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉగదాడి మృతుడు సంతోష్ జగదలే కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు క్యాబినెట్ నిర్ణయించింది.

జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

దీనికి ముందు, జమ్మూకశ్మీర్ ప్రభుత్వం పహల్గాం ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది.

## ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడీకి చెక్

**ఢిల్లీ :** ప్రైవేట్ స్కూళ్లల్లో అడ్డగోలు ఫీజుల దందాపై చరిత్రలో తొలిసారి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఢిల్లీ స్కూళ్లలో ఫీజులు ఎంత మేరకు ఉండాలనే అంశంపై ప్రభుత్వం విధివిధానాల్ని ఖరారు చేసింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోనుంది. ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు- 2025పై ఢిల్లీ కేబినెట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో పలు స్కూల్స్ ఏకపక్షంగా ఫీజుల పెంచుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఢిల్లీ కేబినెట్ మంగళవారం పాఠశాల ఫీజులను నియంత్రించడానికి చట్టాన్ని ఆమోదించింది. అనంతరం ఢిల్లీ సీఎం రేఖా గుప్తా మీడియాతో మాట్లాడారు. నా ఆనందానికి అవధుల్లేవు.ఢిల్లీ ప్రభుత్వం ధైర్యమైన నిర్ణయం నిర్ణయం తీసుకుంది. పలు స్కూల్స్ ఏకపక్షంగా ఫీజుల పెంచుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఢిల్లీ కేబినెట్ మంగళవారం పాఠశాల ఫీజులను నియంత్రించడానికి ఒక చట్టాన్ని ఆమోదించింది. ఢిల్లీ ప్రభుత్వం చారిత్రాత్మక,సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఫీజుల స్థిరీకరణ,నియంత్రణ బిల్లు- 2025 ముసాయిదా బిల్లును ఈరోజు కేబినెట్ ఆమోదించిందని మీకు చెప్పడానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను'అని అన్నారు. ఢిల్లీలోని 1,677 పాఠశాలలు ఎయిడెడ్, నాన్-ఎయిడెడ్ లేదా ప్రైవేట్ అయినా, ఫీజులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకం, విధానాన్ని నిర్ణయిస్తారు. చరిత్రలో మొదటిసారిగా, అటువంటి బిల్లును ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. విద్యా మంత్రి ఆశిష్ సూద్ మాట్లాడుతూ, కొత్త నిబంధనలను అమలు చేయడానికి మూడు కమిటీలను ఏర్పాటు చేస్తామని, పాఠశాల మౌలిక సదుపాయాల ఆధారంగా మూడు సంవత్సరాల పాటు ఫీజులను ప్యానెల్లు నిర్ణయిస్తాయని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా నిర్ణయం తీసుకునే ప్రక్రియలో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల ప్రారంభంలో ఢిల్లీలోని పలు స్కూళ్లు ఏకపక్షంగా ఫీజులు వసూలు చేస్తున్నాయంటూ తల్లి దండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి.ఫిర్యాదులతో పలు పాఠశాలలకు ఢిల్లీ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. తన ప్రభుత్వం పారదర్శకత, పిల్లల విద్యా హక్కు రక్షణకు కట్టుబడి ఉందని ఆ సమయంలో సీఎం రేఖా గుప్తా స్పష్టం చేశారు.

## ఐక్యత చాటాల్సిన తరుణమిది.. మోదీకి ఖర్గే, రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ:** పహల్గాం దాడి నేపథ్యంతో ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. ఇటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వేర్వేరు ఈ ఇద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు రాశారు. 2025 ఏప్రిల్ 22న పహల్గాం ఘటనలో అమాయక పౌరులపై జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడి జరిగింది. ఈ తరుణంలో ఐక్యత, సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉంది. అందుకే పార్లమెంట్ ఉభయ సభలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించండి. తద్వారా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలనే మన సమిష్టి సంకల్పానికి ఇది శక్తివంతమైన ప్రదర్శన అవుతుంది అని ఖర్గే తన లేఖలో ప్రస్తావించారు. ఇక తన లేఖలో రాహుల్ గాంధీ.. ప్రియమైన ప్రధానిగారూ.. పహల్గాం ఉగ్రదాడితో ప్రతీ భారతీయుడు రగిలిపోతున్నాడు. ఇలాంటి క్లిష్టతరుణంలో ఉగ్రవాదానికి మనమెంత వ్యతిరేకమో చాటిచెప్పాల్సిన అవసరం ఉంది. ఐక్యత ప్రదర్శించాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయి. అది పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల మాత్రమే సాధ్యపడుతుందని ప్రతిపక్షంగా మేం భావిస్తున్నాం. ఇక్కడే ప్రజాప్రతినిధులు తమ ఐక్యతను, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించగలరు.

# హామీల అమలులో 'కూటమి' ఘోర వైఫల్యం





**తాడేపల్లి:** రాష్ట్రంలో 'వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్'గా వైఎస్సార్‌సీపీ పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించారని మాజీ మంత్రి, పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున వెల్లడించారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు

**ఆ బాధ్యత పార్టీపై ఉంది:**

రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్దేశించారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజాసమస్యలపై ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండేలా పార్టీని సమాయత్తం చేయాలని ఆయన ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమై, ప్రజల గోడు పట్టించుకోని నిర్లక్ష్యం తాండవిస్తోందని, దీనిపై ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత పార్టీపై ఉందని జగన్ గుర్తు చేశారు.

**వాటిపై దృష్టి సారించాల్సి ఉంది:**

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉండాలనే కోణంలో సమావేశంలో జగన్ పలు అంశాలు నిర్దేశించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ, కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయడంతో పాటు, పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు పూర్తి సమన్వయంతో పని చేయాలని కోరారు.

**హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలి:**

రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయి. బాధితులకు అన్యాయం జరుగుతున్న ప్రతిచోటా వైయస్‌ఆర్‌సీపీ ఉండాలని వైయస్ జగన్ సూచించారు. ప్రజలకు కూటమి పార్టీలు 143 వాగ్ధానాలను ఇచ్చాయి. సూపర్ సిక్స్ కాస్తా గాలికి వదిలేశారు. గత వైయస్‌ఆర్‌సీపీ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు, ప్రజల జీవన ప్రమాణాల్లో తీసుకువచ్చిన మార్పులను మరోసారి గుర్తు చేసుకోవాలి. ఇప్పుడు వాగ్దానాల అమలు అనేది ఎక్కడా లేదు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోంది. సంక్షేమ పథకాలు పేదలకు చేరువ కావడం లేదు. విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పేదలు తమ పిల్లలను చదివించుకోలేక, బడికి పంపాల్సిన పిల్లలను కూలికి పంపుతున్నారు. ఇటువంటి స్థితిలో వైయస్సార్‌సీపీ వారికి అండగా నిలబడుతుంది.

**రైతుల్లో భరోసా కల్పించాలి:**

రైతులను పట్టించుకునే తీరికే కూటమి ప్రభుత్వానికి లేదు. గత వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయంలో రైతేరాజుగా ప్రాధాన్యత ఇచ్చాం. రైతుభరోసా ద్వారా రైతులకు అండగా నిలిచాం. విత్తనం నంచి విక్రయం వరకు ఆర్బీకేల ద్వారా ఆనాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. నేడు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవలే గుంటూరు మిర్చియార్డ్‌కు వెళ్ళిన వైఎస్ జగన్‌కి మిర్చిరైతులు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. దీనిపై వెంటనే సీఎం చంద్రబాబు స్పందించి కేంద్రానికి ఒక లేఖ రాసి, కేంద్రం ద్వారా మిర్చి కొనుగోళ్లు చేయిస్తామంటూ ఒక ప్రకటన చేసి, చేతులు దులుపుకున్నారు. ఆ తరువాత మిర్చి రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు మిర్చి రైతులు కనీస ధరలు లేక, అప్పులపాలై దారుణ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మిర్చి రైతులకు అండగా వైయస్‌ఆర్‌సీపీ కూటమి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడంతో పాటు, రాబోయే రోజుల్లో పార్టీ అధికారంలోకి వస్తే ఏ రకంగా మిర్చి రైతులను ఆదుకుంటామో కూడా వారికి ఒక భరోసాను కల్పించాలని వైఎస్ జగన్ నిర్దేశించారు.

**పొగాకు రైతుల గోడు కూటమి సర్కార్‌కు పట్టడం లేదు:**

పొగాకు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పొగాకు రైతులు తమ పంటను వ్యాపారులు కనీస మద్దతు ధరకు కూడా కొనుగోలు చేయడం లేదని చెబితే, సదరు వ్యాపారుల ఫ్యాక్టరీలకు కరెంట్ తీసేస్తాను అంటూ చంద్రబాబు డ్రామాలు ఆడారు. పొగాకు రైతులను అప్పటికప్పుడు నమ్మించి పంపి, ఆ తరువాత వారి గోడును కనీసం పట్టించుకోని ఘనుడు చంద్రబాబు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పొగాకు రైతుల విజ్ఞప్తులకు స్పందించి వ్యాపారులు తప్పకుండా కొనుగోలు చేయాలని, లేని పక్షంలో మేమే కొనుగోలు చేస్తామని చెప్పి, మార్క్‌ఫెడ్ ద్వారా రూ.200 కోట్లకు పైగా వెచ్చించి మద్దతు ధరకు కొనుగోలు చేయించారు. అదీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చిత్తశుద్ధి. ఈరోజు మార్కెట్‌లో క్వింటా పొగాకు రూ.36 వేలు ధర పలకాల్సి ఉండగా, మార్కెట్‌లో రూ.22 వేలకు కూడా కొనడం లేదు. అందుకే పొగాకు రైతుల పక్షాన ఉద్యమించడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉండాలని సమావేశంలో వైఎస్ జగన్ నిర్దేశించారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున వివరించారు.

# రాజధానిలో మరిన్ని భూములు సమీకరణ

-మొదటిపేజీ తరువాయి

అవసరాలకు అదనంగా భూ సేుకరణ సహా పలు అంశాలను చర్చించారు. స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా, వారికి నష్టం జరిగేలా ఏ కార్యక్రమం, నిర్ణయం ఉండదని సీఎం తెలిపారు. అదనపు భూుసేుకరణ కారణంగా ఈ ప్రాంతంలో ధరలు పడిపోతాుయనే అపోహలకు గురికావద్దన్నారు. తనకు, రైతుులకు మధ్య దూరం ఉండదని చెప్పారు. 'కృష్ణా నదిపై మరో మూడు నాలుగు వారధులు కూడా మస్తాయి. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు వస్తాయి. ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. రాజధాని విస్తురించి పెద్దఎత్తున సంస్థలు, పెట్టుబడులు వస్తాయి. మీ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏమీ జరగదు" అని సీఎం పేర్కొన్నారు. రాజధాని ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల స్మారక చిహ్నం ఏుర్పాటు చేయాలని రైతులు కోరగా... శాతవాహన కాలం నుంచి అమరావతి ఉద్యమం వరకు జరిగిన పరిణామాలన్నీ క్రోడీకరిస్తూ మ్యూజియం ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పారు. రాజధాని పరిధిలోని గ్రామ కంతాల్లో ప్రస్తుతం నివాసం ఉంటూ పట్టాలేని వారికి పట్టాలివ్వాలని అభ్యర్థించగా, దీన్ని కూడా త్వరలోనే చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. అమరావతి పనుల పున:ప్రారంభ కార్యక్రమానికి రావాలంటూ రాజధాని రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. మే 2వ తేదీ రాష్ట్ర చరిత్రలో కీలక మలుపు అని.. రాజధాని నిర్మాణం రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్య అడుగు అవుతుందని సీఎం చెప్పారు. రైతుల త్యాగం కారణంగానే నేడు ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేసుకుంటున్నామని, రైతుల మంచి మనసును ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. భూములిచ్చిన రైతులుకు ప్రభుత్వం తిరిగి కేటాయించే ప్లాట్లకు బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజధానిలో జరిగే ప్రతి కార్యక్రమం, పనుల్లో భాగస్వామ్యం కావాలని రాజధాని గ్రామాల రైతులను చంద్రబాబు ఆహ్వానించారు. సమావేశంలో మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**బయటపడిన బాబు భూ దాహం**

రాజధాని అవసరాలకు మరో 44,676 ఎకరాలు సమీకరించనున్నట్లు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం లీక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు చంద్రబాబు భూ దాహం రాజధాని రైతులతో నిర్వహించిన సమావేశంలోనే బయటపడింది. ప్రభుత్వ భూమితో కలిపి ఇప్పటికే రాజధాని అవసరాలకు సీఆర్‌డీఏ చేతిలో 53,749 ఎకరాలున్న విషయం తెలిసిందే. ఇందులో రైతుల నుంచి సమీకరించిన భూమి 34,566 ఎకరాలు ఉంది. ఇంత భూమి ఉన్నప్పటికీ అంతర్జాతీయ విమానాశ్రయం, స్టేడియాల పేరుతో మరో 44 వేల ఎకరాలకు పైగా భూములను రైతుల నుంచి తీసుకోవాలని ముందుగా నిర్ణయించుకున్న తరువాతనే చంద్రబాబు ప్రభుత్వం మీడియాకు లీకు ఇచ్చింది. ఈ విషుయం సోమవారం రైతులతో సీఎం నిర్వహించిన సమావేశంలోనే బట్టబయలైంది. తుళ్లూరు, అముురావతి, తాడికొండ, మంగళగిరి మండలాల పరిధి లో మరిన్ని గ్రామాలలో భూములు సమీకరించాలని చంద్రబాబు సర్కారు నిర్ణయం తీసేసుకుని.. ఇప్పుడు భూముల విలువ పెరగాలంటే అంతర్జాతీయ విమానాశ్రయం, క్రికెట్ స్టేడియం నిర్మాుణం పేరు చెబుతోంది. అవి చేపట్టడానికి అవసరమైన భూములను రైతుల నుంచి తీసుకుంటామని రైతుల సమావేశంలో సీఎం చెప్పడం గమనార్హం.

# ఇప్పుడు సజ్జలే టార్గెట్టా...



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా అరెస్ట్ లు జరుగుతున్నాయి. ఐపీఎస్ లతో పాటు రాజకీయ నేతలు కూడా ఇప్పటికే జైలుకు వెళుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తమను ఇబ్బందులు పెట్టిన వారిపై పాత కేసులు తోడి మరీ లోపలికి పంపుతున్నారు. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, నందిగం సురేష్ తో పాటు తాజాగా ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు ఇలా ఒక్కొక్కరు కీలక నేతలు జైలుకు వెళ్లి వస్తున్నారు. వీరిలో కొందరు జైలుకు వెళ్లి బెయిల్ పై బయటకు రాగా, మరికొందరు జైళ్లలోనే మగ్గుతున్నారు. అయినా సరే.. గతంలో కీలకంగా మారిన వారందరిపైనా వరస కేసులు నమోదవుతుండటంతో ఇప్పుడు అందరి వేళ్లూ సజ్జల రామకృష్ణారెడ్డి వైపు చూపుతున్నాయి.. సజ్జల రామకృష్ణారెడ్డి గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఆయనకు అప్పటి విపక్షాలు సకల శాఖ మంత్రిగా కూడా పేరు పెట్టారు. ప్రధానంగా హోం శాఖను ఆయన చెప్పుచేతల్లో ఉంచుకుని మరీ నాడు టీడీపీ నేతలను, కార్యకర్తలపై కేసులు పెట్టడమే కాకుండా, సాక్షాత్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు యాభై మూడు రోజుల పాటు రాజమండ్రి జైల్లో ఉండటానికి కూడా సజ్జల డైరెక్షన్ అని టీడీపీ నేతలు బలంగా నమ్ముతున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ స్కిల్ డెవలెప్ మెంట్ స్కామ్ ను బయటకు తీసుకు వచ్చి నాడు సీఐడీ, ఇతర పోలీసు అధికారులతో మాట్లాడి చంద్రబాబు అరెస్ట్ వెనక సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారని టీడీపీ అగ్రనేతలే భావిస్తున్నారు కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకూ సజ్జల రామకృష్ణారెడ్డి పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లే నిరసనను వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పెద్దలకు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలో ఏమీ చేయలేకపోతున్నామన్న బాధ కనిపిస్తుంది. అయితే చట్టప్రకారంగా, అన్ని ఆధారాలను సేకరించిన తర్వాతనే ముందుకు వెళితేనే న్యాయస్థానాల్లో కూడా సజ్జలకు వెసులుబాటు లభించదన్న అంచనాలతో అధికారులు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి కూటమి పార్టీలకు కొరకరాని కొయ్యగా మారిన తరుణంలో ఆయన అరెస్ట్ ఎప్పుడు అన్నది ప్రతి రోజూ సోషల్ మీడియాలో టాపిక్ గానే మారింది. కొసరు నేతలకు కోరి పదవులు ఇస్తారా ఏంది? బలమైన చట్టం ఉన్న... అదే సమయంలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నమోదవుతాయన్న కేసుల విషయంలో ముందస్తు బెయిల్ ను న్యాయస్థానం నుంచి తెచ్చుకుని కొంత ఊరట చెందుతున్నారు. అయితే తాజాగా సజ్జల రామకృష్ణారెడ్డి చుట్టూ ఉచ్చు బిగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అటవీ భూముల ఆక్రమణలో సజ్జల కుటుంబం ప్రమేయం ఉందని అధికారులు దాదాపు నిర్ధారణకు వచ్చారు. అటవీ శాఖ చట్టాలు చాలా బలంగా ఉంటాయి. అందుకే సజ్జల రామకృష్ణారెడ్డిని ఈ కేసులో అరెస్ట్ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగు రిజర్వు ఫారెస్ట్ లో అడవిని నరికి అడ్డంగా సజ్జల ఫ్యామిలీ దున్నేసిందన్న ఆరోపణలున్నాయి. అరవై ఎకరాల ఫారెస్ట్ భూమి ఆక్రమించారంటూ అటవీ, రెవెన్యూ శాఖల నివేదిక కూడా ఇవ్వడంతో ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డిని ఎప్పుడైనా అరెస్ట్ చేసే అవకాశముందన్న వార్తలు వస్తున్నాయి. యాభై ఎకరాలు ఆక్రమణకు గురైందని అటవీశాఖ చెప్పడంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు లోతుగా సర్వే చేసి పూర్తి స్థాయిలో కేసులు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

## మీరే పార్టీ.. పార్టీయే మీరు:

-మొదటిపేజీ తరువాయి

గొంతులేని వారికి బాసటగా నిల్చేది ఎప్పుడైనా మనమే. ప్రతి సమస్యలోనూ మనం బాధితులకు తోడుగా ఉంటాం. తొలి నుంచి అలా నిలుస్తోంది, ఆ పని చేస్తోంది ఒక్క వైయస్‌ఆర్‌సీపీనే. రాష్ట్రంలో ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఆయన చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లోనూ విధ్వంసమే కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో మీ జిల్లాలో పార్టీ ఓనర్‌షిప్ మీదే. అందుకే ప్రజా సంబంధిత అంశాల్లో చొరవ చూపాలి. అంతేకానీ, ఒకరి ఆదేశాల కోసం ఎదురు చూడొద్దు. మీకు మీరుగా స్వచ్ఛందంగా కదలాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిని స్వయంగా కలవాలి. అలా వారితో కలిసి మొదట కదలాల్సిందే మీరే అన్న విషయం గుర్తుంచుకొండి.

మీమీ జిల్లాల్లో పార్టీ మీద మీకు పట్టు ఉండాలి. పార్టీ బలోపేతం కోసం గట్టిగా కృషి చేయాలి. బాధ్యతల నుంచే అధికారం వస్తుంది. పార్టీకి జిల్లాల్లో మీరే సర్వం. జిల్లాల్లో అన్ని స్థానాల్లో పార్టీని గెలిపించాల్సిన బాధ్యత మీది. మనసా వాచా కర్మేణా అదే తలంపుతో పార్టీని నడపాలి. జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించడంలో మీదే కీలక పాత్ర. దీని కోసం ఏం చేయాలన్న దానిపై వ్యూహంతో కదలండి. గట్టిగా పని చేయండి. బాధితులకు మనం ఎప్పుడూ అండగా ఉండాలి. మనమంతా రాజకీయ నాయకులం. మన జీవితాలను రాజకీయాల కోసం పెట్టామనే విషయం మరిచిపోవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ మనం వెనకడుగు వేయకూడదు. ప్రతిపక్షంగా మనకు వచ్చిన అవకాశాలను వదిలి పెట్టకూడదు. జిల్లాస్థాయిలో ప్రజా సంబంధిత అంశాలను మీరు బాగా వెలుగులోకి తీసుకు వస్తేనే ప్రజలకు దగ్గరవుతాం.

**ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంపై..:**

మామూలుగా రెండు, మూడేళ్ళైతే కానీ ప్రభుత్వ వ్యతిరేకత బయటకు కనిపించదు. కాని ఏడాదిలోపే ప్రభుత్వం మీద వ్యతిరేకత తీవ్రంగా ఉంది. అందుకే యుద్ధ ప్రాతిపదికన కమిటీ నిర్మాణం పూర్తి చేయాలి. దీని తర్వాత పార్టీ పరంగా మీకూ, నాకూ పూర్తిగా పని ఉంటుంది. అందరం కలిసికట్టుగా పార్టీపరంగా కార్యక్రమాలు బలంగా ముందుకు తీసుకెళ్లాలి. అందుకే పార్టీ పరంగా నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులతో పాటు, పార్టీ స్టేట్ కో%-%ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పీవీ మిధున్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, జి.శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ కమిటీ

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. ప్రజా ఫిర్యాదులపై ఈ శాసనసభ కమిటీ మొదటి సమావేశం విశాఖలో ఏర్పాటు చేశామని రఘురామరాజు అన్నారు. ఆ కమిటీ విధి విధానాలపై ప్రజలు, ఎమ్మెల్యేలకు కూడా అవగాహన లేదని చెప్పారు. ఈ కమిటీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మీడియా ముందుకు వచ్చామని అన్నారు. ఏ ఫిర్యాదు నైనా శాసనసభ్యుల ద్వారా రిఫర్ చేయాలని సూచించారు. ఆయా సమస్యలపైన తమ కమిటీలో చర్చించి, సంబంధిత అధికారులకు లేఖలు పంపిస్తామని తెలిపారు. చర్యలకు రిఫర్ చేస్తామని... కానీ నేరుగా చర్యలు తీసుకునే అధికారం కమిటీకి లేదని స్పష్టం చేశారు. ఇప్పటికీ కొన్ని పిటిషన్లు తమ దృష్టికి వచ్చాయని... అయితే సుమోటోగా కేసులు తీసుకునే అధికారం తమకు లేదని చెప్పారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ కమిటీ ఉందన్నారు. ఈ కమిటీని పటిష్టంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని రఘురామరాజు వెల్లడించారు.

## యుద్ధ పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి





షికారుకు వచ్చినట్లు వచ్చి పర్యాటకులను వేటాడారని.. ఐడీ కార్డులు అడిగి హిందువా, ముస్లింవా అని అడిగి మరీ అత్యంత క్రూరంగా అమాయకుల ప్రాణాలు తీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిహద్దు భద్రత అత్యంత అవసరమన్నారు. నిరాయుధులతో యుద్ధం చేయకూడదని తెలిపారు. ఎంతో నమ్మకంతోనే కశ్మీర్ పర్యటనకు వెళ్లారన్నారు. కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నంత వరకు ప్రశాంతంగా ఉందని.. అధికారం రాష్ట్రం చేతిలోకి వెళ్లగానే ఇలాంటి ఘటన జరిగిందన్నారు. ఉగ్రవాదులపై కనికరం అవసరం లేదన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. దేశమంతా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు. లక్షలాదిమంది కశ్మీరీ పండిట్లు వలస వెళ్లిపోయారని తెలిపారు. అప్పటి నుంచి కశ్మీర్ మండుతూనే ఉందన్నారు. కశ్మీర్ భారత్‌లో భాగమే.. ఎప్పటికీ అంతే అని స్పష్టం చేశారు. భారత్‌లో ఉండి పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్‌పై ప్రేమ ఉన్నవారు ఆ దేశం వెళ్లిపోవచ్చని అన్నారు. మతం అడిగి చంపేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతుంటే నమ్మరెందుకని ప్రశ్నించారు. అతిమంచితనం కూడా మంచిది కాదని అభిప్రాయపడ్డారు. కాల్చుకుంటూ పోతే చూస్తూ ఊరుకోవాలా.. అతి సహనం కూడా ప్రమాదకరమన్నారు. పాకిస్థాన్‌ను మూడు సార్లు ఓడించామని గుర్తుచేశారు. జనసేన ఉన్నది తెలుగు రాష్ట్రాల్లోనే.. కానీ మాది జాతీయ విధానమని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదులను ఎదుర్కోవాలంటే ధైర్యంతో కూడుకున్న పని అని అన్నారు. హిందువులకు ఉన్నది ఒక్కటే దేశమని.. ఇక్కడ కూడా హిందువులనే టార్గెట్ చేస్తే ఎక్కడికి పోవాలని అన్నారు. హత్య చేసి మోదీకి చెప్పుకోండి అన్నారని.. పర్యాటకులు చెబుతున్నారని తెలిపారు.

**రూ.50లక్షల పరిహారం**

ఉగ్రదాడిలో చనిపోయిన మధుసూదన్ కుటుంబానికి పరిహారం ప్రకటించారు పవన్. జనసేన పక్షాన మదుసూదన్ కుటుంబానికి యాభై లక్షలను ప్రకటించారు. అతని కుటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 'మనం ఏదొక రూపంలో ప్రాణాలు కోల్పోతాం. అది దేశంకోసం అయితే... మన మరణానికి ఒక అర్థం ఉంటుంది. మదుసూదన్ కుటుంబం ఆ పరిస్థితి నుంచి బయటకు రావడం చాలా కష్టం. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారందరికి జనసేన పక్షాన నివాళి అర్పిస్తున్నాం' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు ఉదయ్ ప్రయాణం స్ఫూర్తిదాయకం: సీఎం చంద్రబాబు, లోకేశ్



**అమరావతి:** ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు చేసిన ప్రయాణం అభినందనీయమని సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ధైర్యం, అవిశ్రాంత కృషి ఉంటే ఏ కల కూడా పెద్దది కాదని ఉదయ్ రుజువు చేశారని సీఎం పేర్కొన్నారు. కష్టపడేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారిగా ఉదయ్ ఎదిగారని లోకేశ్ కొనియాడారు. ఆయన ప్రయాణంలో ధైర్యసాహసాలు, త్యాగం, అవిశ్రాంత సంకల్పం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఉల్లపాలేనికి చెందిన ఉదయ్‌కృష్ణారెడ్డి.. ఇటీవల వెల్లడైన సివిల్స్ ఫలితాల్లో 350వ ర్యాంక్ సాధించారు.

## సంపాదకీయం

# పీఓకే నుంచి పరార్

పహల్గాం ఉగ్రదాడితో భారత్– పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ ధీటైన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో.. దేనికైనా సిద్ధం, యుద్ధానికి రెడీ అంటూ పైకి మేకపోతు గాంభీర్యాలు ప్రదర్శిస్తున్నా.. పాకిస్థాన్ లోలోపల వణికిపోతుంది. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నామని ఆధారాలతో తెలిస్తే.. అంతర్జాతీయంగా పాక్ ఒంటరి అవుతుందని తెలిసి ముందస్తు చర్యలు ప్రారంభించింది. పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారత్ ప్రతీకారం తీర్చుకుంటామనే భయంతో.. పాకిస్తాన్ సైన్యం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) అంతటా అనేక ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయడం ప్రారంభించిందని నిఘా వర్గాలు సోమవారం వెల్లడించాయి.. భారత దాడులను నివారించడానికి ఉగ్రవాదులను ఆర్మీ షెల్టర్లు, భూగర్భ బంకర్లలోకి మారుస్తున్నారని నిఘా వర్గాలు తెలిపాయి..పీఓకే ప్రాంతం అంతటా చాలా లాంచ్ ప్యాడ్‌లు ఉన్నట్లు భారత భద్రతా సంస్థలు గుర్తించిన కొంతసేపటికే.. పాకిస్తాన్ ఈ చర్య తీసుకుంది.. కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముకం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుటా, కోట్లి, ఖుయిరట్టా, మంధర్, నికైల్, చమన్‌కోట్, జంకోట్ నుండి ఉగ్రవాదులను తరలించినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి..ఈ లాంచ్ ప్యాడ్‌లు చాలా కాలంగా ఉగ్రవాదులను నియంత్రణ రేఖ (ఎల్ఓసి) దాటి జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేవేశించడానికి..అలాగే.. ఉగ్రవాదులను సమీకరించే కీలక కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. భారత నిఘా, ముందస్తు చర్యల నుంచి తన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కాపాడుకోవడానికి పాకిస్తాన్ ప్రయత్నాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఎల్ఓసి వెంబడి ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి.. ఈ ఉగ్రదాడిలో 26 మంది మరణించారు.గత వారం, భారత భద్రతా దళాలు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ అంతటా పనిచేస్తున్న కనీసం 42 ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లు, శిక్షణా కేంద్రాలపై నిఘా పెట్టాయి. నిఘా నివేదికల ప్రకారం, 150 నుండి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ప్రస్తుతం వివిధ శిబిరాల్లో ఉండి, చొరబాటు ప్రయత్నాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారత్ వద్ద ప్రస్తుతం రెండు విమాన వాహక నౌకలు ఉన్నాయి. ఒకటి విక్రమాదిత్య, మరొకటి విక్రాంత్. ఈ నౌకలను హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో భద్రతా ప్రయోజనాల కోసం వినియోగిస్తారు" అని యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న తిరునావుక్కరసు చెప్పారు."ఇది చాలా ఉద్రిక్త పరిస్థితి. పహల్గాం దాడి వెనుక నిజంగా పాకిస్తాన్ హస్తం ఉండి, యుద్ధానికి అవకాశం ఉంటే గుజరాత్, ముంబయిలను ఆ దేశం సులభంగా లక్ష్యంగా చేసుకుంటుంది. అందుకే ఆ ప్రదేశాల్లో ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టేందుకు ఈ నౌకను నిర్మించారు" అని తిరునావుక్కరసు అన్నారు.శ్రీనగర్ లేదా దిల్లీ వైమానిక స్థావరాల నుంచి విమానాలను నడపడం, ఇతర ప్రాంతాల నుంచి దాడులు చేయడం కంటే, ఈ వైమానిక స్థావరం పైనుంచి దాడిని మరింత సులభంగా, వేగంగా చేయవచ్చు. పాకిస్తాన్‌కు అలాంటి విమాన వాహక నౌక లేకపోవడం ఇండియాకు అనుకూలమైన విషయం" అని అన్నారాయన.యుద్ధనౌకకు పూర్తిగా ఇంధనం నింపితే మాటిమాటికి తీరానికి రావాల్సిన పనిలేకుండా సుదీర్ఘకాలం సముద్రంలోనే పనిచేయగలదన్నారు. మధ్య యుద్ధం జరుగుతుందో లేదో ఎవరూ ఊహించలేరు. ఇప్పుడు జరుగుతున్నదంతా భారతదేశపు సంసిద్ధతను తెలియజేయడానికే" అని మాజీ లెఫ్టినెంట్ కల్నల్ త్యాగరాజన్ అన్నారు.భారత సైన్యం తన యుద్ధనౌకలు, విమానాలు, సైనిక దళాలను అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద ఉన్న స్థావరాలలో మోహరిస్తోంది. శత్రుదళాలు ఏదైనా దాడికి సిద్ధమైతే భారత్ ముందుగానే ఎదుర్కోగలుగుతుంది.ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రస్తుతం కార్వార్ నుంచి ముందుకు వెళ్తోందంటే అది కూడా ఒక కారణమే. శత్రువుల ఇంధన ఉత్పత్తి కేంద్రాలు, భూ, సముద్ర, వైమానిక స్థావరాలు, సమాచార కేంద్రాలు, ఆయుధ డిపోలు, చమురు డిపోలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు అవకాశం ఉంటుంది.'1971 యుద్ధం సమయంలో ఐఎన్ఎస్ విక్రాంత్ తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)పై సైనిక చర్యలు, నౌకాదళ దాడులు నిర్వహించింది. ప్రస్తుత కార్యకలాపాలు 1971 యుద్ధ వ్యూహాన్నిఅనుసరిస్తూ జరిగి ఉండొచ్చు" అని త్యాగరాజన్ అన్నారు.రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక ఈ నౌక నిర్మాణ పనులు ఆగిపోయాయి. అప్పుడు బ్రిటీష్ ప్రభుత్వం ఆ అసంపూర్ణ నౌకను అమ్మేస్తామని ప్రకటించింది. 1957లో భారత్ ఈ నౌకను కొనుగోలు చేసింది. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత 1961లో దానిని జాతికి అంకితం చేశారు.సముద్ర మార్గం ద్వారా పాక్ సైనికుల దాడులను అడ్డుకుని, శత్రు లక్ష్యాలను ధ్వంసం చేసిందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పేర్కొంది.భారత నౌకాదళంలో 36 ఏళ్లపాటు సేవలందించిన తరువాత 1997లో విక్రాంత్‌కు విశ్రాంతిని ఇచ్చారు. దీనిని పూర్తిగా ధ్వంసం చేయడానికి ముందు 15 ఏళ్లపాటు మ్యూజియంగానూ ఉపయోగించారు.హిజ్బుల్ ముజాహిదీన్, జైష్-ఎ-మొహమ్మద్ , లష్కరే-ఎ-తోయిబా నుండి దాదాపు 60 మంది విదేశీ ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్‌లో చురుగ్గా ఉన్నారని, 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారని నిఘా వర్గాలు నివేదించాయి..

## ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని

# శాసించిన మహాకవి శ్రీశ్రీ



ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించి, తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పి శ్రీశ్రీగా ఎదిగి, మహాకవిగా గుర్తింపు పొందారు శ్రీరంగం శ్రీనివాసరావు, 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పటకొండ దంపతులకు విశాఖపట్నంలో జన్మించాడు. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఈయన ఇంటి పేరు శ్రీరంగం గా మారింది. శ్రీశ్రీ ప్రాథమిక విద్యాభ్యాసం మొత్తం విశాఖపట్నం లో జరిగింది. శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన ఏడవ యేటనే ప్రారంభించాడు. తన మొదటి గేయాల పుస్తకం ఎనిమిదవ యేట ప్రచురింపబడింది.1931లో మద్రాసు యూనివర్సిటీలో బి.ఏ పూర్తి చేశాడు.1935లో విశాఖలోని మిసెస్ ఎవిఎస్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరాడు. 1938 లో మద్రాసు ఆంధ్రప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తర్వాత ఢిల్లీ ఆకాశవాణిలోను, నిజాం సంస్థానంలోను, ఆంధ్రవాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుంచి 1940 వరకు తాను రాసిన 'గర్జించు రష్యా', 'జగన్నాథ రథ చక్రాలు' వంటి గొప్ప కవితలను సంకలనం చేసి 'మహా ప్రస్థానం' అనే పుస్తకంగా ప్రచురించాడు శ్రీశ్రీ. తెలుగు సాహిత్యపు దశను, దిశను మార్చిన పుస్తకం గా శ్రీశ్రీ మహాప్రస్థానం మిగిలిపోయింది. ఈయన ప్రముఖ హాస్యనటుడు రాజబాబుకు తోడల్లుడు. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా ప్రసిద్ధుడయ్యాడు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది మరియు నాస్తికుడు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందాడు. వివిధ దేశాల్లో ఎన్నోమార్లు పర్యటించాడు. ఎన్నో పురస్కారాలు పొందాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి "రాజా లక్ష్మీ ఫౌండేషను" అవార్డు వీటిలో కొన్ని. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పనిచేసాడు. 1970లో అతని షష్టిపూర్తి ఉత్సవం విశాఖపట్నంలో జరిగింది. ఆ సందర్భంగానే అతను అధ్యక్షుడుగా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. కొంతకాలం క్యాన్సరు వ్యాధి బాధకు లోనై 1983 జూన్ 15 న శ్రీశ్రీ మరణించాడు. మహాప్రస్థానం ఆయన రచించిన కావ్యాల్లో ప్రసిద్ధమైనది... మరో ప్రపంచం,మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది!పదండి ముందుకు, పదండి త్రోసుకు!పోదాం, పోదాం పైపైకి!కదం త్రొక్కుతూ,పదం పాడుతూ, హృదాంత రాళం గర్జిస్తూ-పదండి పోదాం, వినబడలేదామరో ప్రపంచపు జలపాతం?దారిపొడుగునా గుండె నెత్తురులుతర్పణ చేస్తూ పదండి ముందుకు!బాటలు నడచీ,పేటలు కడచీ, కోటలన్నిటిని దాటండి!నదీ నదాలూ, అడవులు, కొండలు, ఎడారులా మన కడ్డంకి?పదండి ముందుకు! పదండి త్రోసుకు! పోదాం, పోదాం, పైపైకి! ఎముకులు క్రుళ్ళిన, వయస్సు మళ్ళినసోమరులారా! చావండి! నెత్తురు మండే, శక్తులు నిండే,సైనికులారా! రారండి!"హరోం! హరోం హర! హర! హర! హర! హర!హరోం హరా!" అని కదలండి!మరో ప్రపంచం, మహా ప్రపంచంధరిత్రినిండా నిండింది!పదండి ముందుకు,పదండి త్రోసుకు!ప్రభంజనంవలె హోరెత్తండీ!భావ వేగమున ప్రసరించండీ!వర్షుకాభ్రములన ప్రళయ ఘోషవ లెపెళ పెళ పెళ పెళ విరుచుకు పడండి! పదండి, పదండి, పదండి ముందుకు!కనబడలేదా మరో ప్రపంచపు కణకణ మండే త్రేతాగ్ని?ఎగిరి, ఎగిరి, ఎగిరి పడుతున్న విఎనభై లక్షల మేరువులు!తిరిగి, తిరిగి, తిరిగి సముద్రాల్జల ప్రళయ నాట్యం చేస్తున్నవి!సలసలక్రాగే చమురా? కాదిది ఉష్ణరక్త కాసారం! శివసముద్రమూ, నయాగరావలెఉరకండీ! ఉరకండీ ముందుకు!పదండి ముందుకు!పదండి త్రోసుకు! మరో ప్రపంచపు కంచు నగారావిరామ మెరుగక మ్రోగింది! త్రాచులవలెనూ, రేచులవలనూ,ధనంజయునిలా సాగండి! కనబడలేదా మరో ప్రపంచపుఅగ్నికిరీటపు ధగధగలు, ఎర్రబావుటా నిగనిగలు,హోమజ్వాలల భుగభుగలు?

# భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే



దాదాసాహెబ్ పాల్కే అసలు పేరు ధుండీరాజ్ గోవింద్ ఫాల్కే ఈయన ఒక భారతీయ సినీ నిర్మాత, దర్శకుడు, స్క్రీన్‌ప్లే-రచయిత, భారతీయ సినిమా కు ఇతను పితామహుడు. ఇతడి ప్రథమ సినిమా రాజా హరిశ్చంద్ర (భారతీయ మొదటి సినిమా) 1913. ఇతడు తన జీవితంలో 95 ఫీచర్ ఫిల్మ్ లు, నిర్మించాడు. బొంబాయిలో భారతీయ సినిమా జూబ్లీ ఉత్సవాల సందర్భంగా 1939 లో ఫాల్కేకు అయిదువేల రూపాయలు పర్సు బహూకరించారు.1966 లో ఇతని పేరు మీద దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, భారత ప్రభుత్వంచే స్థాపించబడింది. దాదాసాహెబ్ ఫాల్కే సంస్కృత పండితుని కుమారుడు. ఏప్రిల్ 30 1870లో నాసిక్‌లోని త్రయంబకేశ్వర్‌లో జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. తనను ఆ వార్త బాగా ఆలోచింపజేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన అతన్ని కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించబోతున్నానని తెలియదు, అదే తన జీవితాన్ని పేదరికంలోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు.ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో పాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగిపోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించేవారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఈ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించేవారు. సినిమా బృందం 60-70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి. భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అందజేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు.బొంబాయిలో జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బహుమతి పొందిన తర్వాత ఫాల్కే పేదరికంతోనే స్వగ్రామం చేరుకున్నాడు. దాదాపు అందరూ మర్చి పోయిన తరుణంలో 1944, ఫిబ్రవరి 16 న తుది శ్వాస విడిచాడు. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ అతని జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తినిచ్చేవిగానే ఉన్నాయి. అతని పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, అతని జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచకపోవటం శోచనీయం.

# ప్రజాసేవలో ఘనాపాఠీ...

నీతి, నిజాయతీలకు మారుపేరు, నిబద్ధతకు ప్రతిరూపం ఆయన. తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజా నాయకుడు. రాజకీయాల విలువలకు పెద్దపీట వేసి, ప్రజాపోరాటాల్లో పాల్గొన్న చైతన్యశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ శాసనసభ్యుడు, గ్రంథాలయోద్యమ సారథి, రాష్ట్ర తొలి అధికార భాషా సంఘం అధ్యక్షుడు, బహుగ్రంథకర్త. పోరాట యోధుడు, ప్రజా సేవకుడు. ఆజన్మ బ్రహ్మచారి, అపర భీష్ముడు. ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఖాదీ దుస్తులతో, చేతిలో ఖాదీ సంచితో నిరాడంబరంగా కనిపించే అజాత శత్రువు.ఆయన గురించి ఎంత రాసినా తక్కువే. ఆయనే ప్రజలు మెచ్చిన నేత...వావిలాల గోపాల కృష్ణయ్య. వావిలాల గోపాలకృష్ణయ్య (సెప్టెంబరు 17, 1906 – ఏప్రిల్ 29, 2003) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడు, పద్మ భూషణ పురస్కార గ్రహీత. కళా ప్రపూర్ణ బిరుదు గ్రహీత. 1906 సెప్టెంబరు 17న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వావిలాల నరసింహం, పేరిందేవి దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు. పలనాడు పుల్లరి సత్యాగ్రహంలో గార్లపాటి హనుమంతరావు తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘ సభ్యుడిగా ఉంటూ, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావల్సిందేనని పట్టుబట్టారు.1925లోనే సత్తెనపల్లిలో 'శారదానిలయం' అనే గ్రంథాలయాన్ని, వావిలాల గోపాలకృష్ణయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ హయర్ స్టడీస్ అనే సంస్థని గుంటూరు అరండల్‌పేటలో ఏర్పాటు చేశారు. 1974 – 77 కాలంలో తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షునిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘ సంయుక్త కార్యదర్శిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సివిక్ బోర్డు సభ్యుడిగా పనిచేసారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి, గెలుపొందారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం ఏర్పడటంతో ఆక్కడ పోటీ చేసి తొలి శాసన సభ్యుడిగా ప్రజలకు సేవలు అందించారు. 1952, 1955, 1962, 1972 ఎనికల్లో వరుసగా నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా గెలిచి 19 ఏళ్ల పాటు ప్రజా సేవలో నిలిచారు. ఆయన కృషి ఫలితంగానే శాతవాహన నూలు మిల్లు, ఫణిదం చేనేత సహకార సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయి. సమాజంలో అసమానతలను రూపు మాపేందుకు ఎంతో కృషి చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమ సంస్థ బాధ్యుడిగా, గ్రంథాలయ ఉద్యమ రథ సారథిగా, దళిత, గిరిజనోద్ధరణ ఉద్యమ నాయకుడిగా ఆయన ముందు నడిచారు. పద్మభూషణ్‌తో పాటు ఎన్నో పురస్కారాలు, సత్కారాలను అందుకున్నారు.ఏక సంథాగ్రాహి, తెలుగు ఆంగ్ల భాషలలో అనేక గ్రంథాలు రచించిన మేధావి. తెలుగులో నలభై అయిదు, ఆంగ్లంలో పదహారు పుస్తకాలు రచించారు.1922లో 'శివాజీ', 1947లో మద్రాసు మంత్రివర్గమా ఎక్కడికి? 1951లో విశాలాంధ్రం, 1976-77లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమం తదితర రచనలు చేశారు. పత్రికా విలేఖరిగా ప్రారంభించి ప్రజా సేవకే సర్వం త్యాగం చేసిన త్యాగశీలి, ధన్య జీవి గోపాలకృష్ణయ్య. సుదీర్ఘమైన ఆయన ప్రజా జీవిత ప్రస్థానంలో అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. 'విశాలాంధ్ర' ఉద్యమం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం. అన్నిటికన్నా అతి ముఖ్యమైనది నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కోసం ఆయన చేసిన కృషి మరువ రానిది. నాటి ప్రధాని నెహ్రూ చేత ఆ ప్రాజెక్ట్ కు శంఖుస్థాపన చేయించటంలో వావిలాల కృషి మరవ లేనిది. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' అనే సత్కారంతో గౌరవించింది. భారత ప్రభుత్వం వీరిని 'పద్మ భూషణ్' బిరుదుతో సత్కరించింది.చివరి రోజులలో ఆనారోగ్యానికి గురై నిమ్స్‌లో కొంతకాలం వైద్యం చేయించుకొన్న ఆయన 2003 ఏప్రిల్ 29న మరణించారు.

# అక్రమ మత్తు పదార్థాల రవాణాకు గట్టి దెబ్బ




అక్రమ మత్తు పదార్థాల రవాణాకు గట్టి దెబ్బగా, ఈగల్ టీమ్ (యాంటీ గంజాయి యూనిట్) ఐజీ మరియు ఎస్పీ ఆధ్వర్యంలో, ఏలూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ (ఐపీఎస్)ల పర్యవేక్షణలో ఒక ముఖ్యమైన సంయుక్త ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమాచారం జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ వి. కృష్ణ బాబు అందించిన విశ్వసనీయ ఇంటెలిజెన్స్ ఆధారంగా, స్థానిక పోలీసులతో కలిసి ఈగల్ టీమ్ కలిసి అంతాలను సమన్వయంగా అమలు చేసింది. 2025 ఏప్రిల్ 29వ తేదీ ఉదయం 6:30 గంటల సమయంలో, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ %కాఖ%. జబీర్ మరియు ఈగల్ టీమ్‌కు చెందిన ఆర్ఎస్ఐ నేతృత్వంలో, %బీఎం-516ఖ%లో దేవరపల్లి నుండి తల్లాడ వైపుగా వెళ్లే మార్గంలోని మార్కెట్ యార్డు చెక్ పోస్టు వద్ద అనుమానాస్పదమైన రెండు వాహనాలను ఆపి తనిఖీ చేశారు.

ఈ తనిఖీలో గంజాయి అక్రమ రవాణాలో పాల్గొన్న ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు:

మనం చంద్రదొర ఏ దొరబాబు (కాకినాడ జిల్లా) %-% సరఫరాదారు

ఈపు ధనరాజ్ (అనకాపల్లి జిల్లా) %-% సరఫరాదారు

నాయుడు రాజా (కాకినాడ జిల్లా) %-% రవాణాదారుడు

బొంతు దుర్గా సతీష్ (కాకినాడ జిల్లా) %-% రవాణాదారుడు

కుడితి చిన్ని (కాకినాడ జిల్లా) %-% రవాణాదారుడు

వీరు గంజాయిని టాటా యోధ వాన్ (%కాా39 ఎడీ% 2612) మరియు లిలిమారుతి స్విఫ్ట్ డిజైర్ కార్ (%కాా39 ఖఖ% 3815) లలో అక్రమంగా రవాణా చేస్తున్నారు.

పట్టుబడిన సొత్తు: మొత్తం 394.795 కిలోల గంజాయి %-% 189 ప్యాకెట్లు, 12 ప్లాస్టిక్ బస్తాల్లో రవాణా కోసం ఉపయోగించిన రెండు వాహనాలు నాలుగు మొబైల్ ఫోన్లు ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో %ఒకీ. వీ. 161/2025, ఖ/ా 8(ప) బీ/జ 20(ఎ)(ఖఖ)(ఐ) బీఖాకా% చట్టం కింద కేసు నమోదు చేయబడింది. నిందితులను రిమాండ్కు పంపనున్నారు. పట్టుబడిన గంజాయి సుమారు రూ. 39,47,950/- విలువచేసేంతగా అంచనా వేయబడింది. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులు ు సరఫరాదారు, రవాణాదారు, కొనుగోలుదారులను త్వరలో అరెస్ట్ చేసే అవకాశముంది.

ప్రశంసలు: ఈ ఆపరేషన్‌ను కచ్చితంగా అమలు చేసిన జంగారెడ్డిగూడెం సీఐ వి. కృష్ణ బాబు మరియు ఎస్ఐ ఎస్కె జబీర్లను, ఈ క్రింది సిబ్బంది సహకారంతో %×+% ఈగల్ మరియు ఏలూరు జిల్లా ఎస్పీ వారు ప్రశంసించారు:

%ాా×% (ఈగల్ టీమ్)

%కాా×% ఎన్.వి. సంపత్ కుమార్

హెడ్ కానిస్టేబుల్ ఎన్. ఉమా మహేశ్వర రావు

కానిస్టేబుళ్లు ఎన్. రమేష్ మరియు బి. రాజశేఖర్

ఈ పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని అభినందించిన గౌరవ ఐజి గారు. ఈ కార్యక్రమంలో గౌరవ హైజిగారు మాట్లాడుతూ ఎన్డిపిఎస్ యాక్ట్ 5(%కాా%) ప్రకారం గంజాయి గానీ ఇతర మత్తు పదార్థాలు గానీ సాగుచేసిన అమ్మినటువంటి వ్యక్తుల యొక్క ఆస్తులను స్వాధీనం చేసుకునేటటువంటి చట్టం ఉన్నట్లు, ఆపరేషన్ గరుడ ద్వారా మందులు షాపులలో తనిఖీలు నిర్వహించి 165 మందుల షాపులపై కేసులను నమోదు చేసినట్లు ఏలూరు జిల్లాలో ఐదు షాపులపై కేసులు నమోదు చేసినట్లు, కొన్ని మందులను మందులు షాపులలో డాక్టర్ల యొక్క ప్రశ్నలు లేనిదే ప్రజలకు అమ్మరాదని అలా అమ్మిన యెడల వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకొనబడతాయని, రాష్ట్ర ప్రభుత్వం వారు విద్యాసంస్థలలో ఈగల్ క్లబ్ అనే టీం ను తయారు చేస్తున్నట్లు, వారు మత్తు పదార్థాలు వలన కలిగే అనర్థాలను గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారని, ఎవరైనా గంజాయి స్మగ్లర్ల యొక్క ఆస్తులను కొనుగోలు చేసిన ఎడల అటువంటి ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునేటటువంటి చట్టం ఉన్నట్లు ప్రతి ఒక్కరూ గమనించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి సమూల నిర్మూలన కొరకు అనేక రకాలైనటువంటి చర్యలు తీసుకుంటున్నట్లు, గంజాయి పండే ప్రాంతాలలో ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపిస్తూ వారిలో పరివర్తన తీసుకొచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు మన రాష్ట్రానికి ఎక్కువగా ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి రవాణా అవుతున్న విషయంపై త్వరలో ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయ మీటింగ్ ను నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఈగల్ ఐ జి గారు తెలియ చేసినారు

# స్విమ్స్ ఆధ్వర్యంలో మల్లాం-2, కోగిలి గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



ఏప్రిల్ 29,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో మంగళవారం చిట్టమూరు మండలం మల్లాం పిహెచ్ సిలోని మల్లాం-2, కోగిలి గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.

మే 1 నుంచి దక్కిలి పిహెచ్ సిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

స్విమ్స్ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి దక్కిలి మండలం, దక్కిలి పిహెచ్ సి పరిధిలోని 13 ప్రాంతాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నాయి.

- మే 1న డి.వడ్డిపల్లి, పాతనాలపాడు.
- మే 5న దగ్గవోలు, సంగనపల్లి.
- మే 8న లింగసముద్రం, శ్రీపురం.
- మే 12న మాధవాయపాళెం, ఠీర్ధంపాడు.
- మే 15న మోపూరు, వెలికల్లు.
- మే 19న నాగవోలు, వెంబులియూరు.
- మే 22న పాలుగోడు.

స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మల్లాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.మదన్ మోహన్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ హరిత, సర్పంచులు ఎం.దినబంధు, కె.పోలయ్య, పంచాయతీ కార్యదర్శులు ఎం.ఆనందయ్య, స్థానిక నాయకులు టి.వాసు, బి.నాగరాజు, ఇ.యశ్వంత్, ఎస్కె రషీద్, కె.చెంగయ్య, అబ్దుల్, షబ్బీర్, సూపర్వైజర్లు చెంచుకృష్ణ, పద్మావతి, మస్తాన్ బాబు, ఏఎన్ఎంలు ఎ.శ్రీదేవి, హమీద, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్




ఏప్రిల్ 29,(ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని గతంలో 12 నెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడం వల్ల వారి కుటుంబాలు పుటగడవక అగమ్య గోచరంగా ఉన్నాయని తక్షణమే 12 నెలల వేతనాలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన లు చేపడుతామని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు..మంగళవారం స్థానిక గంధమనేని శివయ్య భవన్ లో యూనియన్ జిల్లా సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఏ.శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ నాగసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణలు లు మాట్లాడుతూ రాష్ట్రంలో 14,000 మంది పనిచేసే ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 12 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రెండు నెలలు వేతనాలు రాకుంటేనే కూటగడవడం ప్రస్తుత పరిస్థితుల్లో ఇబ్బందిగా ఉండని ఇన్ని నెలలు పెండింగ్లో ఉండడం వల్ల మహిళ ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు... పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఆర్ పి ఎస్ ఎస్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు సిద్ధమని వారు అన్నారు..10సంవత్సరాలనుండి గౌరవ వేతనం తో పనిచేస్తున్న సిబ్బంది ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సమస్యల పరిష్కారం కోసం తక్షణమే కృషి చేయాలని, మహిళా కార్మికులకు పనిగంటల విధానం అమలు చేయాలని వేతనాలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు.. పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. పిఎఫ్ ఈ ఎస్ ఐ సౌకర్యం కల్పించి హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని వారు కోరారు.. త్వరలో వేతనాలు విడుదల కాని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కి పిలుపు ఇస్తామని ఆందోళన కి సిద్ధమవుతామన్నారు.

**తిరుపతి జిల్లా నూతన సమితి ఎన్నిక**

ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ తిరుపతి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ బాబు తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా రాధాకృష్ణ అధ్యక్షులుగా శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యప్ప నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు గా వీర రాఘవయ్య, శంకర్, సుబ్రహ్మణ్యం, వెంకట చలం, శ్రీనివాసులు, సుధాకర్, ప్రధాన కార్యదర్శి గా పి వెంకటేశ్వర్లు, డిప్యూటీ కార్యదర్శి అనంతరావ్, సహాయ కార్యదర్శులుగా సుకుమార్, కళావతి, రవి, లక్ష్మి, వెంకటేశ్వర్లు, ట్రెజరర్ గా సుబ్రహ్మణ్యం లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

## యర్రవరంలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన ఆర్డిఓ కె శ్రీ రమణి



కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో భూ రీ సర్వే ప్రక్రియను పెద్దాపురం ఆర్డీవో కె శ్రీ రమణి పరిశీలించారు.మొత్తం 11 టీంల పని విధానాన్ని స్థానిక ఎమ్మార్వోను అడిగి తెలుసుకున్నారు.విలేజ్ సరిహద్దులు,11 బ్లాక్ ల సరిహద్దు పాయింట్ల వివరాలు పరిశీలించారు.సర్వే జరిగే ప్రదేశాలలో ప్రభుత్వ భూములను గుర్తించే దిశలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎస్ పి ఓ ఎల్ ఆర్ ను పరిశీలించారు. రెవిన్యూ అధికారులు అందరూ రైతులకు అందుబాటులో ఉంటూ రీ సర్వే పూర్తిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎమ్మార్వో కుశరాజు, రీ సర్వే డిటి సంధ్య,ఆర్ ఐ పొన్నాలు,వీఆర్వోలు మణికంఠ,అప్పారావు,శ్రీను, సత్యారావు,రమణ, సర్వేయర్లు సత్యనారాయణ, దుర్గాప్రసాద్,తదితర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి యుగ్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్.ఎస్.యు వి.సి ,అకాడమిక్ డీన్



ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి )తిరుపతి జిల్లా ప్రతినిధి న్యూఢిల్లీలోని భారత మండపం కన్వెన్షన్ సెంటర్లో మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ -వద్వాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యుగ్మ కార్యక్రమానికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి, అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, భూతపూర్వ ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ.ఆర్డే రమశ్రీ పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో ఇన్నోవేటివ్ కార్యక్రమాలను,అధునాతన ఆవిర్భావాలను ఏ విధంగా చేయాలి అనే అంశం పైన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ కార్యక్రమం నూతన ఒరవడులను సంస్కృత క్షేత్రంలో ఏ విధంగా సృష్టించవచ్చు అనేదానికి ఒక మార్గదర్శకంగా ఉపయోగపడిందని, ఈ కార్యక్రమాలను పాల్గొనడం ఎంతో స్ఫూర్తిదాయకము మరియు మార్గదర్శకమని హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధ్యాపకులు అధికారులు వి.సి ప్రొ.కృష్ణమూర్తికి, అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల మరియు భూతపూర్వ రిజిస్ట్రార్ ఇన్చార్జ్ ప్రొ.ఆర్డే రమశ్రీకి అభినందనలు తెలియజేశారు.

## నూతన రైడర్స్-ఈవెంట్స్ ప్రారంభించిన..




ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు... ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన నానిపల్లి వెంకన్న( వెంకీ) నూతన రైడర్స్-ఈవెంట్స్ ప్రారంభించిన ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత %డ% ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి నాని , నారిరెడ్డి వీరబాబు , సారిపల్లి గోవింద్ ,కోలా తాతబాబు , బొల్లు నాగేశ్వరరావు ,జువ్వల దొరబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు ,గుమ్మిడి రామకృష్ణ గారు,కోలా సూరిబాబు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తిరుపతిలో ఘోరం...

## ముగ్గురు వలస కార్మికులు మృతి..





ఏప్రిల్ 29,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి తిరుపతిలో విషాదం చోటుచేసుకుంది. ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. మంగళం తుడా క్వార్టర్స్ హెచ్‌బిజీలో నిర్మాణ దశలో ఉన్న 5 అంతస్తుల భవనం పైనుంచి పడి ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మృతులు శ్రీనివాసులు, వసంత్, కె.శ్రీనివాసులుగా గుర్తించారు. బిల్డింగ్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడి కార్మికులు చనిపోయినట్లు తెలుస్తోంది. మృతులు వసంత్, శ్రీను, శ్రీనివాసులు ఒంగోలుకు చెందిన వారుగా గుర్తించారు పోలీసులు. పొట్టకూటికోసం తిరుపతికి ఉపాధికి కోసం వచ్చారు. ఎప్పటిలాగే దినసరి కూలి నిమిత్తం పనులకు వెళ్లారు. కడిపటి అందాయ్య భవనం వద్ద నిర్మాణ పనులు జరుగుతుండగా 60 అడుగుల భవనంనుంచి ప్రమాదవశాత్తు కిందకు పడ్డారు. ముగ్గురు కూలీలు అక్కడే కక్కడే ప్రాణాలు విడిచారు. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి




**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** జామి పోలీసు స్టేషన్ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్.. పోలీసు స్టేషనుల్లోని వివిధ రికార్డులు, సిడి ఫైల్సు్ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని, వాటిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించిన జిల్లా ఎస్పీ. విజయనగరం జిల్లా జామి పోలీసు స్టేషన్ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఏప్రిల్ 29న ఆకస్మికంగా సందర్శించి, స్టేషను ప్రాంగణంను పరిశీలించి, పోలీసు స్టేషను రికార్డులు, సిడి ఫైల్సు్ను తనిఖీ చేసి, స్టేషను ప్రాంగణంలో పార్కింగు చేసి ఉన్న వాహనాలు గురించి ఎస్ఐని అడిగి తెలుసుకొని, వాటిని త్వరితగతిన సంబంధిత వ్యక్తులకు అప్పగించాలని అదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - నేరాల నియంత్రణ, ఛేదనలో సిసి కెమెరాలు చాలా ముఖ్య భూమికను పోషిస్తున్నాయన్నారు. నేర నియంత్రణలో భాగంగా పోలీసు స్టేషను పరిధిలో సాధ్యమైనన్ని ఎక్కువ సిసి కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సందర్శనలు తరుచూ చేయాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను గుర్తించి, వాటిని నియంత్రించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడా జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని, పేకాటలు, కోడి పందాలను నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపైన, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైన కేసులు

నమోదు చేయాలని ఎస్ఐని జిల్లా ఎస్పీవకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జామి పోలీసు స్టేషను పరిసరాలను పరిశీలించి, పార్కింగు చేసివున్న వాహనాలను పరిశీలించి, వాటిని ఏ కేసులో సీజ్ చేసారన్న విషయాలను అడిగి తెలుసుకొని, చట్ట ప్రకారం చర్యలు చేపట్టి, వాటిని రిలీజ్ చేయాలని ఎస్ఐని ఆదేశించారు. రిసెప్షను రిజిస్టరును పరిశీలించి, ఫిర్యాదులను ఏవిధంగా రిజిస్టరులో నమోదు చేస్తున్నది, డిస్పోజ్ చేస్తున్నది పరిశీలించారు. జనరల్ డైరీ, సెంట్రీ బుక్కు, బీటు బుక్కులు, డ్యూటీ రోస్టరు, విలేజ్ రోస్టరు, కేడి చెక్ రిజిస్టరు, క్రైం అబాస్ట్రాక్ట్, క్రైం చార్టు, సిడి ఫైల్సు్ను జిల్లా ఎస్పీ తనిఖీ చేసారు. దర్యాప్తు లో ఉన్న కేసుల సీడి ఫైల్సు్ను పరిశీలించి, దర్యాప్తు జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఐటీ కేసుల్లో నిందితుల బ్యాంకు అకౌంట్స్ లో ఫ్రీజ్ చేసిన నగదు కోర్టు అనుమతితో బాధితులకు అందే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్సైని ఆదేశించారు. పోలీసు స్టేషనులో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నది, వారు ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నది ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది దత్తత గ్రామాలు తరుచూ సందర్శించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్ఐని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సర్కిల్ ఇన్స్పెక్టరు ఎల్.అప్పలనా యుడు, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, జామి ఎస్ఐ వై.వీర జనార్ధన్ మరియు జామి పోలీసు స్టేషను సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వైభవంగా పరశురామ జన్మోత్సవ ఉత్సవం





**గుంతకల్లు ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** కసాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానంలో మంగళవారం విష్ణుమూర్తి అవతారమైన పరుశురామ స్వామి జన్మోత్సవ ఉత్సవం సందర్భంగా రాష్ట్రంలోనే ఎక్కడ చూడని ప్రత్యేకమైన రాతి శ్రీ పరశురామ స్వామి 9 అ.9 ఇ.ఎత్తు గల కృష్ణశిల విగ్రహంకు మంగళవారం శ్రీ పరశురామ స్వామీ జన్మోత్సవమును పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక అలంకరణతో స్వామివారికి విశేష పూజలు ఆలయ ధర్మకర్తలు తలారి శకుంతలమ్మ పరశురాముడు దంపతులు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించ డం జరిగినది. అనంతరం అర్చకులు రాకేష్ మాట్లాడు తూ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహర్షి పుత్రుడిగా జన్మించి మహా శివ భక్తుడగా తపస్సు తో పరశును పొంది మహా బలిశాలిగా దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం ఈ రోజునే విష్ణుమూర్తి దశావతారాలలో పరశురాముడిగా ఆరవ అవతారంగా పురాణాలు చెబుతున్నాయి అందుకే ఈ తిథినాడు ఆలయాల్లో పరశురామ జన్మోత్సవము నిర్వహిస్తారు ఇదే రోజునే సింహాచలం క్షేత్రంలోనీ శ్రీలక్ష్మీ వరాహ నరసింహు నిజ స్వరూపాన్ని దర్శించుకునే భాగ్యం భక్తులకు కలుగుతుంది నిజ రూపాన్ని దర్శించుకునే భాగ్యం భక్తులకు కలుగుతుందని ఈ నెలలోనే గౌతమ బుద్ధుడుకు జ్ఞానోదయం కలిగిన రోజు శ్రీమహావిష్ణువు ఎంతో ఇష్టమైన మాసం వైశాఖం అన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త తలారి పరశురాము డు మాట్లాడుతూ ఆది దేవుని దేవాలయ నిర్మాణం ఆ దేవుని సంకల్పంతో మాకు మా కుటుంబానికి ఇంతటి భాగ్యం కల్పించినందుకు స్వామి అమ్మ వారి పాద సేవలోనే ఉంటామని మంగళవారం శ్రీ పరశు రామ స్వామి జన్మోత్సవ ఉత్సవా లు వైభవంగా జరగడం సప్త చిరంజీవిలో ఇద్దరు చిరంజీవులు శ్రీ పరశురామ స్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారు ఉండడం ఈ దేవస్థానం విశేషం అందరికీ స్వామి వారి జన్మోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి ఆశీస్సులు పొందడం, అనంతరం అన్న ప్రసాద వితరణలో అన్న ప్రసాదం స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి మల్లికార్జున స్వామి కమిటీ సభ్యులు అన్న ప్రసాద్ సేవకుడు పాల్గొనడం జరిగింది.

# అనంతపురం జిల్లా అభివృద్ధికి, ఆత్మగౌరవంకు ఆర్డిటి సేవలు ఎంతో అవసరం

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తలారి వెంకటేష్**

**గుంతకల్లు ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** అనంతపురం జిల్లా అభివృద్ధికి,ఆత్మగౌరవంకు ఆర్డిటి సేవలు ఎంతో అవసరమని, సేవ్ ఆర్ డి టి కోసం మన వంతుగా సహాయ సహకారాన్ని అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తలారి. వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తలారి వెంకటేష్ మాట్లాడుతూ మానవత్వానికి సామాజిక సేవకు ప్రతిరూపమైన ఆర్డిటి సంస్థను ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 1962వ సంవత్సరంలో భారత దేశంలో స్థాపించారని, ముఖ్యంగా ఆర్డిటి లేకుంటే అనంతపురం జిల్లా లేదు కొన్ని లక్షల మంది విద్యార్థులను చదివిస్తూ లక్షలమందికి వైద్యం అందిస్తూ,వికలాంగులకు పెన్షన్లు ఇస్తూ లక్షల మంది కి సొంత ఇల్లు నిర్మించిన ఘనచరిత్ర ఆర్ డి టి సమస్థదని,ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి విదేశీ నిధులు అందకుండా ఎఫ్ సి ఆర్ ఏ. ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులర్టి చట్టం. అనుమతులను. ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం అనుమతులను. పునరుద్ధరించకుండా నిలుపుదల చేయడం వలన అనంతపు రం,కర్నూల్,ప్రకాశం గుంటూరు, తెలంగాణలోని మహబూబ్నగర్, నల్గొండ జిల్లాల్లో పేద విద్యార్థులు పేదల జీవితాలు చీకటిమ యం అవుతాయి కావున ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తక్షణమే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎఫ్ సి ఆర్ ఏ .ను. రెగ్యులర్. చేయించా లని, ప్రభుత్వాలకు చేతనైతే ఆర్డిటి సంస్థతో పోటీపడి సేవా కార్యక్రమా లు అభివృద్ధి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి వెంకటేష్ డిమాండ్ చేశారు.



## శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో అవార్డుల బహూకరణ



**ఏప్రిల్ 29,(ప్రజా జ్యోతి)తిరుపతి జిల్లా ప్రతినిధి** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవార్డుల బహూకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని పాల్గొని అవార్డులు అందజేశారు. స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య టి. సుధా, ఎస్.ఎస్.ఎస్. హెచ్%d%ఎమ్ ఇంచార్జి డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.బి.గంగా భవాని, కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ ఆచార్య పి. మల్లికార్జున, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఆచార్య ఐ.వి.లలిత కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొని అవార్డులు అందించారు. బెస్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు డా.డి.యువశ్రీ కి డా.కె.ఆర్.పద్మ కి, బెస్ట్ యూనిట్ అవార్డు డా.ఎస్. వజిహాబాను కి, డా.కే.రుక్మిణి కి అందజేశారు. బెస్ట్ పీఓ సెకండ్ రన్నరప్ డా. బి.హేమావతి కి, సెకండ్ రన్నరప్ బెస్ట్ యూనిట్ డా.ఆర్.భారతి కి, అప్రీషియేషన్ అవార్డు డా. వై. అనిత కి అందజేశారు. యూనివర్సిటీ మొత్తానికి బెస్ట్ %మీూా% వాలంటీర్ గా ఎమ్.రమ్యాతో పాటు 22 యూనిట్స్ కి 22 మంది వాలంటీర్స్ కు అప్రిసియేషన్ అవార్డులు అందజేశారు.

## యస్వీయూకు భారీగా ఆదాయపన్ను తిరిగి చెల్లింపులు



**ఏప్రిల్ 29,(ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారీ స్థాయిలో ఇన్ కమ్ టాక్స్ డబ్బులు తిరిగి వచ్చాయని రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు తెలియజేశారు. విశ్వవిద్యాలయం చరిత్రలో ఇంత మొత్తం ఆదాయ పన్నుశాఖ నుంచి తిరిగి రావడం, విశ్వవిద్యాలయం ఖాతాలో చేరడం ఆనందంగా వుందని వారు అన్నారు. గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విశ్వవిద్యాలయానికి రావలసిన ఇన్ కమ్ టాక్స్ రిటర్న్ ను గురించి విశ్వవిద్యాలయం కామర్స్ పూర్వ విద్యార్థి డా? ఫల్గుణ కుమార్ తన బృందంతో కలిసి రెండునెలలుగా లెక్కలు వేసి, ఎలాంటి ఫీజు తీసుకోకుండా డిపాజిట్లపై ఆదాయపన్ను శాఖకు చెల్లించిన డబ్బు నుంచి 1,03,84000/-రూపాయలు తిరిగి చెల్లించేలా కృషి చేశారని, ఫలితంగా ఆ డబ్బు విశ్వవిద్యాలయం ఖాతాలో ఈ రోజు జమ అయ్యిందని తెలిపారు. అంతేకాకుండా గడచిన 5 సంవత్సరాల కాలంలో యస్వీయూ చెల్లించిన ఆదాయ పన్ను నుండి దాదాపు 8.75 కోట్ల రూపాయలు తిరిగి చెల్లింపు చేసేలా లెక్కలు వేసి ఫాల్గుణ కుమార్ ఆదాయపన్ను శాఖకు సమర్పించారని , ఆ డబ్బు కూడా విశ్వవిద్యాలయానికి వచ్చే అవకాశం వుందని అన్నారు. ఈ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా తన వంతు విశ్వవిద్యాలయం అభివృద్ధిలో భాగస్వామ్యులైన డా? ఫల్గుణ కుమార్ ను అవిశ్వవిద్యాలయం పక్షాన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ , భవిష్యత్తులో వారి సేవలు విశ్వవిద్యాలయానికి అందించాలని కోరారు.

## ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 సిమెంట్ బస్తాలు అందజేత.




**పోడూరు, ఏప్రిల్ 29,ప్రజాజ్యోతి న్యూస్.** పోడూరు మండలం పెనుమదం గ్రామ పెదపేట కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణం నిమిత్తం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 సిమెంట్ బస్తాలను అందజేశారు. ఆ కాలనీ పెద్దలు మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లి సహాయం చేయమన కోరారు. అందులో భాగంగా ఫౌండేషన్ సభ్యులు మంగళవారం సిమెంట్ బస్తాలను అందజేశా రు. ఈ సందర్భంగా ఆ ప్రాంత పెద్దలు మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రావూరి అప్పారావు, పీతల శ్రీను, మేడిశెట్టి కేశవ, పెనుమాదం గ్రామ సర్పంచ్ తానేటి బాబురావు, ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, గ్రామ కూటమి నాయకులు దేవరపు దొరబాబు, కడలి ఆంజనేయులు,బోసు పాముల నాగరాజు, గెద్దాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బ్రాండ్‌తోనే మామిడి ఎగుమతులు

**హైదరాబాద్ :** తెలంగాణ మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో పండించే మామిడి పండ్లను శుద్ధి చేసి, తెలంగాణ బ్రాండ్ పేరుతో రైతులే నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉద్యానశాఖ రూ.35 కోట్లతో సమగ్ర ప్రతిపాదనలు రూపొందించింది. తెలంగాణ మామిడికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంలో ఏటా సుమారు ఆరు వేల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుండగా.. అందులో వెయ్యి టన్నుల వరకు ప్రైవేటు కంపెనీల ద్వారా ముంబై, బెంగళూరుల మీదుగా విదేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ క్రమంలో మధ్యవర్తులు లాభాలు గడిస్తుండటంతో, రైతులకు సరైన ఆదాయం అందడం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఎగుమతులకు అవసరమైన అత్యాధునిక శుద్ధి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. దీనిలో భాగంగా, మామిడిపై ఉండే పురుగులను తొలగించే రేడియేషన్ ప్రక్రియ కోసం రూ.24 కోట్లతో అటామిక్ రీసెర్చ్ ఎనర్జీ యంత్రం, పండ్లను మెరిసేలా చేసే వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.5 కోట్లు, మామిడిని మగ్గబెట్టే హాట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.3 కోట్లు, నిల్వ కోసం కోల్డ్ రూమ్స్‌కు రూ.4 కోట్లు మరియు ఇంటిగ్రేటెడ్ ప్యాకింగ్ కోసం రూ.2 కోట్లు కేటాయించనున్నారు.

# ప్రధాని పర్యటనకు భారీ జన సమీకరణ




## బాపట్ల నుంచి 350 బస్సులు...

## జాగ్రత్తలపై అధికారులకు కలెక్టర్ సూచన...

**బాపట్ల ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 2వ తేదీ అమరావతి రానున్న సందర్భంగా ప్రజలను తరలించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి జిల్లా కలెక్టరేట్లో మంగళవారం మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి 16వేల మంది ప్రజలను అమరావతి లో జరిగే ప్రధానమంత్రి కార్యక్రమానికి సంబంధించిన కార్యక్ర మానికి ప్రజలను తరలించడానికి జిల్లా నుండి రవాణా సౌకర్యం కోసం 350 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. అమరావతి కార్యక్రమానికి వెళ్లే బస్సుల్లో 50 శాతం మంది మహిళలు 50 శాతం పురుషులకు సీట్లు కేటాయించాలని తెలిపారు ప్రజలను తరలించ డానికి ఏర్పాటుచేసిన బస్సులను 1వ తేదీ రాత్రికి అధికారులు కేటాయించిన ప్రాంతాలకు చేరుకో వాలని సూచించారు గ్రామాల నుండి బస్సులు 2వ తేదీ ఉదయం 9 గంట లకు బయలుదేరే విధంగా అన్ని రకాలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యక్రమానికి వచ్చే ప్రజలు మధ్యాహ్నం 12 గంటలకు అమరావతికి చేరుకో వాలని కలెక్టర్ చెప్పారు. అమరావతి కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్ ల్లో మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లను సహాయకులుగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు అమరావతి కార్యక్రమానికి తరలి వెళ్లే ప్రజలు తిరిగి వారి గ్రామాలకు వచ్చే వరకు కూడా అధికారులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు అమరావతి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు భోజన సౌకర్యాలు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి కార్యక్రమానికి వెళ్లే ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్త కుండా వెళ్లే మార్గాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలసమాచారాన్ని తెలుసుకోవాలనిఅధికారులకు ఆయన చెప్పారు. జిల్లా నుండి ప్రధానమంత్రి పర్యటనకు వెళ్లే వాహనాలు గుంటూరు కాజా టోల్ ప్లాజా మీదుగా వెస్ట్ బైపాస్, కొండవీటివాగు, వెలగపూడి పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలని ఆయన చెప్పారు. జిల్లాలో మే 1వ తేదీన పెన్షన్లు పంపిణీ చేయడానికి అధికారు లు చర్యలు తీసుకో వాలని ఆయన తెలిపారు ఈనెల 30వ తేదీన పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ నగదును బ్యాంకులో డ్రా చేసుకొని భద్రపరు చుకోవాలని కలెక్టర్ చెప్పారు. పెన్షన్ల పంపిణీలో లోటు పాట్లకు తావు లేకుండా సక్రంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, జిల్లా రిజిస్ట్రార్ సాయి తేజ, జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్ , జిల్లారవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా గ్రామంలోకి పైడితలమ్మ ఆగమనం









## మంగళ వాయిద్యాలతో గ్రామపొలిమేర నుండి గ్రామంలోకి అమ్మవారికి ఆహ్వానం

## భక్తుల జయ జయ ధ్వనులతో కిటకిటలా డిన పురవీధులు

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం , పిలిస్తే పలికే తల్లి కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పొందూరు పైడితల్లి అమ్మవారు . 12 వ శతాబ్దంలో శాలివాహన చక్రవర్తుల కాలంలో వెలసిన అమ్మవారి పండుగ 15 ఏళ్ళు తరువాత నిర్వహించడంతో ఒక్కసారిగా పొందూరు పట్టణంలో సందడి నెలకొంది. పైడితల్లి అమ్మవారి ఊరి పండుగ జూన్ నెలలో నిర్వహించనున్న నేపథ్యంలో ఆరుగురు అప్పజెల్లలకు గ్రామ పోలి మేరల నుండి గ్రామంలోకి స్వాగతం ( చల్లదనం ) చేసే కార్యక్రమాలను గ్రామస్తులంతా ఘనంగా నిర్వహించారు.చల్లదనం కార్యక్రమాలు అనంతరం పైడితల్లి అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం రాత్రి సమయంలో అంగడ వీధిలో ఉన్న పొందూరు గ్రామ దేవతల నిలయం వద్ద నుండి భారీ ఎత్తున మేళ తాళాలతో ,మంగళ వాయిద్యాలతో కోటి వరాల కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని గ్రామ పులిమేరల నుండి గ్రామంలోకి ఆహ్వానిస్తూ స్వాగతం పలికేందుకు బయలుదేరారు.ముందుగా మేళతాళాలతో గ్రామ పెద్దలను ఆహ్వానించి అందరూ ఒక చోట చేరుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణం కు చేరుకున్నారు. పైడితల్లి అమ్మవారి పండుగ కమిటీ సభ్యులు , ఆలయ కమిటీ సభ్యులు , దమ్మల కులస్తులు సమక్షంలో తరతరాలుగా పోలాకి కుటుంబీకులు పసుపు ముద్ద రూపంలో ఉన్న అమ్మవారి ప్రతిమను గ్రామంలోకి తీసుకువస్తారు. 15 ఏళ్ళు తర్వాత అమ్మవారి పండుగ నిర్వహించడం తో చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో ఉల్లాసంగా పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వారి జయ జయ ధ్వనుల మధ్య అమ్మవారిని స్వాగతం పలికే కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని తీసుకువచ్చే పురవీధులు వేపాకుల తోరణాలు , దీపకాంతులతో కళకళలాడాయి. ఎన్నడూ లేని విధంగా ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులు అయ్యారు. అమ్మవారి ఆలయం ప్రాంగణం చేరుకో గానే తరతరాలుగా అమ్మవారిని గ్రామంలోకి తీసుకువస్తున్న పోలాకి కుటుంబానికి చెందిన పోలాకి రామారావు ( గ్రామదేవత పూజారులు ) పైడితల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారి ప్రతిమ అయిన పసుపు ముద్దను గ్రామ పొలిమేరల్లో తల్లి ఎక్కడుందో వెతికి తల్లి కనిపించిన అనంతరం పసుపు ముద్ద రూపంలో ఉన్న ఆ తల్లిని ఆలయ ప్రాంగణం నుండి అంగటి వీధిలో గల గ్రామ దేవత నిలయానికి వైభవంగా చేర్చారు. తల్లి గ్రామం లోకి వచ్చిన నాటి నుండి పెద్ద పండుగ ముగిసే వరకు దమ్మల వారు ( గ్రామ దేవత పూజారులు ) ఇంట పైడితల్లమ్మ కొలువుదీరుతుంది. ప్రతీ రోజూ సంధ్యాస్తమయం అనంతరం పెద్ద పండుగ జరిగే వరకు తల్లిని పురవీధుల మీదుగా దర్శన భాగ్యం కల్పిస్తారు.

# ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం





**ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** పరమశివుని పాదాల నుంచి పుట్టిన నృత్యానికి 64 కళలల్లో ఎంతో ప్రాముఖ్యత ఉందని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి అన్నారు . అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని తిరుపతిలో రాయలసీమ రంగస్థలి కళాకారులను మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జతీస్ నృత్యాలయ నిర్వాహకురాలు నృత్య కళాకారిణి శైలజా రెడ్డిని ఘనంగా సత్కరించి అంతర్జాతీయ నృత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ 64 కళలలో ఒకటైన నృత్యానికి ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ ఉందని అలాంటి కళ కు ఓ రోజును కేటాయించడం సంతోషంగా ఉందన్నారు.. ముఖ్యంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో నృత్యం అంతర్భాగమై ఉందని చెప్పారు. ఆది కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు మనుషుల జీవితాలలో నృత్యం భాగమైందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు కే ఎన్ రాజా, పద్మనాభం సుబ్రమణ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడేను విజయవంతం చేయాలి.సీఐటీయూ.



**పోదూరు, ఏప్రిల్ 29,ప్రజాజ్యోతి న్యూస్ .** మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటలపనిదినంహక్కులను కాపాడుకోవడానికి ప్రతి కార్మికుడు దీక్షపునుతూ వాడవాడలా మేడే జండాలు ఆవిష్కరించాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ అన్నారు . నేడేను విజయవంతం చేయాలని పోదూరు మండల కేంద్రం లో కార్మికులను కలిసి మేడే సమీకరణకు ఏర్పాటులో ఉన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాల రాసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్ లను తీసుకువచ్చాయని అన్నారు. 8 గంటల పని దినం స్థానే 12 నుంచి 15 గంటల పని చేసేలా పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కార్మికుల దోపిడీ తీవ్ర మౌతుందన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా వారి చేత వేట్టి చాకరిచేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . అసంఘటిత రంగం కార్మికుల సంక్షేమానికి సమగ్రచట్టంరూపొందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికుల పని ప్రదేశాల్లో నివాస ప్రాంతాల్లో విస్తృతంగా మే డే జండాలను ఆవిష్కరణ చేయాలన్నారు. నూతన రవాణా చట్టం డ్రైవర్ల పాలిట ఉరితాళ్ల గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాకర వెంకటేశ్వర్లు, గ్యాస్ వర్కర్స్ సతదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు కూలీల మృతికి కారణమైన భవన యజమానిని అరెస్టు చేయాలి

**ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** యజమాని ఆస్తులను సీజ్ చేసి కూలీలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి: సిఐటియు డిమాండ్ మంగళం సమీపంలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో అక్రమంగా నిర్మిస్తున్న 5 అంతస్తుల భవంతి పైనుంచి ప్రమాదవశాత్తు క్రిందపడి మరణించిన ఘటనలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, యజమాని నేరపూరిత చర్యలు ఉన్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా ఆరోపించారు. ముగ్గురు మృతికి కారణమైన భవన యజమాని ఆండాలయ్యను అరెస్టు చేసి జైలుకు పంపాలని, ఆయన ఆస్తులను సీజ్ చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. మరణించిన కూలీల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కందారపు మురళి ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడం, ఇఓ పీఆర్డీకి షోకాజ్ నోటీస్ ఇవ్వడంతో సరిపెట్టకుండా, కఠిన చర్యలు సంబంధిత వ్యక్తులపై తీసుకోవాలని మురళి ఆ ప్రకటనలో కోరారు. మంగళం ప్రాంతంలో అక్రమ కట్టడాలు, ఆక్రమణలు విపరీతంగా పెరిగాయని, అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో ఇవి సాగుతున్నాయని ఆరోపించారు. జిం3 అనుమతులు భవన యజమానికి ఉండగా జిం5 నిర్మాణాలు గత కొన్ని నెలలుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదంటే, అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వాస్తవంగా తిరుపతి నగరం, తిరుపతి రూరల్, మంగళం, బిటిఆర్ కాలనీ, తిరుమల నగర్, రామచంద్రపురం, చంద్రగిరి తదితర ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో బిల్డింగ్ నిర్మాణాలు సాగుతున్నాయని, అపార్ట్ మెంట్లు పేరుతో జరుగుతున్న నిర్మాణాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని ఉన్నాయని, ఈ పనుల దగ్గర కూలీలు ప్రమాదానికి గురికాకుండా ముందస్తు చర్యలు ఏవీ లేవని గుర్తు చేశారు. కార్మిక శాఖ, పంచాయతీ, మున్సిపల్, తుడా అధికారులు సంబంధిత వ్యక్తుల పట్ల ఉదాసీనంగా ప్రవర్తిస్తుండటం వల్ల ఇలాంటి ఘటనలు పలుమార్లు జరుగుతున్నాయని గుర్తు చేశారు. తిరుపతి జిల్లాలో భారీ స్థాయిలో జరుగుతున్న నిర్మాణాలపై తనిఖీలు జరపాలని, ముందస్తు చర్యలు, అనుమతులు లేని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని కందారపు మురళి ఆ ప్రకటనలో కోరారు

## వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు,రోగులకు మజ్జిగ పంపిణీ



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు....**
**ప్రత్తిపాడు** మానవతా దృక్పధంతో వివేకానంద సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్ అన్నారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి మంగళవారం వైద్యం నిమిత్తం వచ్చే గర్భిణీ స్త్రీలకు,రోగులకు దాహార్తిని తీర్చేందుకు వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని డాక్టర్ సౌమ్య మైఖేల్ ప్రారంభించి మీడియాతో మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉండడంతో ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలు,రోగులు డీహైడ్రేషన్ కి గురి కాకుండా వివేకానంద సేవా సమితి చేస్తున్న సేవలను కొనియాడారు.మైరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి మంగళవారం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతలు సహకరిస్తే గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మద్దాల అంజి,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 1వ తరగతిలో ప్రవేశలకు దరఖాస్తులు స్వీకరణ.

**పోదూరుఏప్రిల్ 29,ప్రజాజ్యోతి న్యూస్.** విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణకు మే 2 నుండి మే 19వరకు సమయం ఇచ్చినట్లు మండల విద్యాశాఖాధికారులు జి.విజయ కుమార్, జి వి. సూర్యనారాయణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ప్రాథమిక వివరాలతో సియస్ఇ.ఏపి.జిఓవి.ఇన్ వెబ్ సైట్ లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రస్తుత చిరునామా కోసం దరఖాస్తుదారుల తల్లిదం డ్రుల ఆధార్, ఓటరు కార్డు, రేషను కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు, పాస్పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్తు బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదో ఒక%ఎ% గుర్తింపు కార్డు, పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలని అన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన విజయవంతం చేయండి:టిడిపి జిల్లా అధ్యక్షుడు సి ఆర్ రాజన్





**ఏప్రిల్ 29,(ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి పర్యటన విజయవంతం చేయాలని చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సి ఆర్ రాజన్ పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా పర్చూర్ నియోజకవర్గంలో ప్రధానమంత్రి మోడీ పర్యటన సందర్భంగా పర్చూర్ నియోజకవర్గ అబ్జర్వర్గా సిఆర్ రాజన్ ను నియమించారు. ఈ నేపద్యంలో పర్చూర్ నియోజకవర్గంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అలాగే కూటమి నాయకులందరూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి పర్యటన విజయవంతనికి అందరూ కృషి చేయాలని తెలిపారు ఈ సందర్భంగా డాక్టర్ సి. ఆర్ రాజన్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైసిపి పాలనలో అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడం జరిగింది మరల తెలుగుదేశం అధికారం కు వచ్చినా వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో అమరావతి పనులు పునర్ ప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్నారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయచంద్ర నాయుడు పాల్గొన్నారు

## డిసిసి బ్యాంకు చైర్మెన్‌ను సన్మానించిన జహంగీర్ బాషా



**బద్వేల్ ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి న్యూస్)** కడప జిల్లా సహకార బ్యాంకు ఛైర్మెన్ గా ఎంపిక అయిన మంచూరు సూర్య నారాయణ రెడ్డి ని తెలుగు యువత కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు జహంగీర్ బాషా మంగళవారం ఎన్జీవో కాలనీ అయన స్వగృహం లో గజమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జహంగీర్ బాషా మాట్లాడుతూ ఆపదలో ఎవరు వున్నా నేను ఉన్నానంటూ ఆదుకునే మంచి వ్యక్తి అని తెలుగు దేశం పార్టీ లో కీలక పాత్ర పోషిస్తున్న సూర్యనారాయణ రెడ్డి ని జిల్లా సహకార బ్యాంకు ఛైర్మెన్ గా పార్టీ అధిష్టానం కు టిడిపి నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్ రెడ్డి మాజీ ఎంఎల్ ఏ విజయమ్మలు సిఫారసు చేసి ఆయనకు జిల్లా పదవి దక్కేలా చేయడం సంతోషం అన్నారు. సూర్య నారాయణ రెడ్డి భవిష్యత్తు లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సిరిగిరి పల్లె ముస్తఫా. మున్రెడ్డి ఎల్లారెడ్డి. మాచుపల్లి కృష్ణారెడ్డి. మహబూబ్ బాషా. సత్తార్. రఫీ. గోరే నరసింహారెడ్డి. కేశవ. జిలాని. తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ ఆదేశాలు పట్టించుకోని ప్రైవేటు విద్యాసంస్థలు

**క్లాసులు పెట్టి నడుపుతున్న విద్యాసంస్థల**

**ఎక్కడ కనిపించని విద్యార్థి సంఘాలు..అని ప్రశ్నిస్తున్న విద్యార్థి నీ విద్యార్థుల తల్లి దండ్రులు**







**నందిగామ, ఏప్రిల్ 29 – ప్రజాజ్యోతి** ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వేసవి సెలవులను ప్రకటించాయి. ఏప్రిల్ 23వ తేదీ (బుధవారం)తో ఈ విద్య సవంత్సరం ముగిసింది. చివరి రోజు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. దీంతో గురువారం (ఏప్రిల్ 24) అన్ని విద్యాసంస్థలకు సెలవులు అమలులోకి వచ్చాయి. వేసవి సెలవులు జూన్ 11 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి. ఇక పాఠశాలలు మాత్రం కొత్త విద్యా సంవత్సరం (2025-26) జూన్ 12న పునఃప్రారంభం అవుతాయి. అయితే అన్ని యాజమాన్య పాఠశాలల్లోని ఉపాధ్యాయులు జూన్ 6న విధుల్లో చేరాలని ఏపీ విద్యా శాఖ ఆదేశించింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్,కళాశాలలు మరియు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు, కోరుతున్నారు. ఎక్కడ కనిపించని విద్యార్థి సంఘాలు అని ప్రశ్నిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు తల్లి దండ్రులు?.. సంవత్సరమంతా విరామం లేకుండా చదివే పిల్లలకు వేసవి సెలవులలో కొంత విశ్రాంతి లభిస్తుందని, దానికి కూడా వారికి దూరం చేస్తూ క్లాసులు నిర్వహించటం ఏమిటనే ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రవేట్ పాఠశాలలు మరియు ప్రవేట్ కళాశాలలు పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి తల్లిదండ్రులు.

## ఆర్డిటి (ఎఫ్ సీ ఆర్ ఏ) రెన్యువల్‌ను పునరుద్ధించాలి

# సంస్థను పరిరక్షించు కుందాం



**గుంతకల్లు ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** ఆర్డిటి ని స్వర్గీయ ఫాదర్ విన్సెంట్ పెర్రర్ ఉమ్మడి అనంతపురం జిల్లా లో 1969 వ సంవత్సరం లో స్థాపించిన సేవా సంస్థ. ఈ 56 సంవత్సర కాలంలో 63 మండలాల్లో వందలాది గ్రామాలు మారుమూల గ్రామాల్లో మరియు పట్టణాల్లో ఏ ప్రతిఫలం ఆశించకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థ అని యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ టి. జయన్న(సమాజ సేవకుడు ) తెలిపారు. గ్రామాల్లో ఉన్న పేద రైతులకు,హరిజన,గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు ఉన్నత చదువులు కోసం అనేక పథకాలను అమలు చేసింది. పేద పిల్లలు కు క్రీడల్లో శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. వికలాంగులకు ప్రత్యేకమైన పాఠశాలలు ఏర్పాటు చేసి వారిని ప్రయోజకులు గా తీర్చి దిద్దారు. విద్యార్థులకు బట్టలు, పుస్తకాలు,బ్యాగులను, పెన్సిల్, పెన్నులు ఇలా విద్యార్థు లకు అవసరమైన వాటిని అన్నింటిని సమకూర్చి ఉన్నత స్థాయికి చేరుకోవడా నికి కారణం అయింది. పేదవారికి నాణ్యమైన వైద్యం అందించడానికి కళ్యాణదుర్గం,కణేకల్, బత్తలపల్లి లో హాస్పిటల్స్ నిర్మించి అతి తక్కువ ఖర్చుతో కార్పోరేట్ వైద్యం అందిస్తున్నారు. పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కొరకు నిరంతరం పరితపిస్తూ ఉన్నారు. పేదలకు అండగా నిలవడం కోసం వైద్య, విద్య కోసం అనేక పాఠశాలలు కళాశాలలు, వైద్య శాలలు, గ్రంథాలయాలు, వసతి గృహాలు కొరకు భవనాలను నిర్మించారు. పేద ప్రజలకు సేవ అందించడం లో ప్రభుత్వం తో సమానంగా సేవా కార్యక్రమాలు ను అందించింది. జిల్లాలో అటవి సంపద మరియు నీటి సంరక్షణ లో అనేక సంస్కరణలు చేపట్టారు. జిల్లాలో విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను కాపాడి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరి చేందుకు కృషి చేశారు. వ్యవసాయం రంగంలో లో విప్లవాత్మకమైన మార్పులు కు శ్రీకారం చుట్టింది. ఆర్డిటి చేసిన కృషి ప్రతీ ఒక్కరిలో సేవా భావాన్ని పెంపొందించే విధంగా ఉపయోగ పడుతున్నదని జయన్న తెలిపారు. కులాల మతాలకు అతీతంగా అందరికీ సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. జిల్లాలో ఫాదర్ పెర్రర్ కి గుడి కట్టించి పూజలు చేస్తున్నారు. అనేక గ్రామాల్లో పట్టణాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఫాదర్ పెర్రర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళుతున్న ఆర్డిటి సంస్థ కు ఎఫ్ సీ ఆర్ ఏ ను వెంటనే పునరుద్ధరణ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలు కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడి వెంటనే ఆర్డిటి సంస్థ ను సేవా కార్యక్రమాలు చేసేవిధంగా ప్రభుత్వం సహకరించాలని మనవి చేస్తున్నాని ఒక ప్రకటనలో జయన్న తెలిపారు.

# దేవుని భూములకు కరువైన రక్షణ

**శాలిహుండం ట్రస్టు నోటీసులకు నందల తయారీదారులు బేఖాతారు**

**నోటీసులు ఇస్తే నాకేంటి అంటూ నందల తయారీదారుని వైనం**

**చోద్యం చూస్తున్న దేవాదాయ శాఖ**



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు కనబడితే చాలు ఆక్రమణకు ఎగబడుతున్నారు. అటువంటిది రోడ్డుకు ఆనుకుని ఉన్న అత్యంత విలువైన భూమిని విడిచిపెడతారా మండల కేంద్రంలో.రాపాక కూడలి నుండి అంబేద్కర్ కూడలి వరకు రోడ్డు ప్రక్కన భూమి విలువ ఆకాశాన్ని అంటుతుంది. అయితే శాలిహుండం వేణుగోపాల స్వామి ఆలయ ట్రస్టు కు ఈ రోడ్డు ప్రక్కన 198 సర్వే నెంబర్ లో 1.47 ఎకరాల విలువైన భూమి ఉంది. రెవెన్యూ రికార్డులతో పాటు దేవాదాయ శాఖకు సంబంధించిన 43 రికార్డుల లోనూ శాలిహుండం ట్రస్టు భూమిగానే ఉండి. అయితే కోట్ల విలువ చేసే ఈ భూమిని చేజిక్కించుకునేందుకు విశాఖ లో స్థిరపడినపొందూరు కు చెందిన వ్యక్తి ప్రయత్నాలు చేస్తున్నారు. దశాబ్దాల క్రింద సాగు చేశానాని ఈ భూమిని తనకు ఇవ్వాలని ట్రస్టు చైర్మన్ మధు రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అయితే భూమిని రక్షించుకునేందుకు ట్రస్టు చైర్మన్ భూమిని లీజుకు ఇవ్వలేదు. అయితే సదరు వ్యక్తి తనకు అనుకూలంగా ఉన్న పొందూరు చెందిన కె భూలోక అనే వ్యక్తితో ఈ భూమిని ఆక్రమించి నందలు తయారు చేస్తున్నాడు. ఇటీవల ట్రస్టు చైర్మన్ మధు రెడ్డి దేవాదాయ శాఖ అధికారులతో కలిసి స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడంతో పోలీస్ స్టేషన్ కు పిర్యాదు చేశారు. అయినా నందల తయారీ దారుడు స్థలాన్ని ఖాళీ చేయలేకపోగా మరింత ఆక్రమణకు పాల్పడ్డాడు. ట్రస్టు చైర్మన్ ప్రశ్నిస్తే ఖాళీ చేసేదే లేదని ఏమి చేసుకుంటారో చేసుకోండి అని ఎదురు తిరిగినట్లు తెలుస్తుంది. విలువైన దేవుని భూములు రక్షించాల్సిన దేవాదాయ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

# పేదరిక నిర్మూలన చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**పిఫోర్ పూర్ టు పావర్టీ ముఖ్య ఉద్దేశం పేదరిక నిర్మూలన.**

**ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**





**చందర్లపాడు, ఏప్రిల్ 29 – ప్రజాజ్యోతి** చందర్లపాడు మండల పరిధిలోని ముప్పాళ్ళ గ్రామం నందు మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ లక్ష్మీశా అధికారులు మరియు కూటమినేతలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల ముప్పాళ్ళ గ్రామ పర్యటనలో భాగంగా పిఫోర్ కార్యక్రమంలో బంగారు కుటుంబాలు మరియు మార్గదర్శకాల సహకారంతో ఇచ్చిన హామీ ప్రకారం కుటుంబ పోషణ కొరకు ఆటో కుట్టుమిషన్లు ఎంప్లాయిమెంట్ కార్డ్ మెడికల్ కిట్లు మరియు ఇంటి స్థలమును లబ్ధిదారులకు అందజేసిన ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలనతో దూసుకుపోతోందని అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పాలన కొనసాగుతోందని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ముందుకు వచ్చిన మార్గదర్శకులకు హృదయపూర్వక పాదాభివందనాలు మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవన ఉపాధి నిమిత్తం ఈరోజు ఇంతటి మహత్ కార్యక్రమాన్ని నిర్వహించుకొనడం చాలా సంతోషమని తెలిపారు. మార్గదర్శకులు క్రక్స్ బయోటెక్ మరియు సేంతిని బయో ప్రొడక్ట్స్ వారు బంగారు కుటుంబాలైన పగడాల నాగరత్నమ్మ భర్త తంబి, కొండ్రు వెంకటరవమ్మ భర్త వెంకటేశ్వర్లు లకు ఆటోలను అందించారు. కొండ్రు వెంకటరావుమ్మ కి నివాసము కొరకు 0.03 సెంట్ల ఇంటి పట్టాను అందజేయడం జరిగినది. మహిళల జీవనోపాధికి ఎంతో వెసులుబాటుగా ఉండే కుట్టు మిషన్ (జిగ్ జాగ్ మిషన్ మోటారుతో) లను పగడాల నాగరత్నమ్మ, కొండ్రు వెంకటరావమ్మ, ఉప్పెల్లి నాగజ్యోతి, బొబ్బ శ్రీలక్ష్మి, పగడాల ప్రియాంక, బోలీనిడి శిరీష లకు అందజేయడం జరిగినది. యువత ఉపాధికై వారికి మార్గదర్శకులు అనురాధ అంబా కోచ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు కే లక్ష్మయ్య తండ్రి పెద్ద కొండలు, శ్రీమతి రమాదేవి భర్త లక్ష్మయ్యకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అలానే ఆరోగ్య అవసరాల నిమిత్తము కోటా పుష్పమ్మ భర్త శ్రీహరి, దాచేపల్లి కాలిమ్మ భర్త భద్రయ్య, జమ్ముల అనంతరామయ్య తండ్రి చౌదరయ్య, నల్లాని అప్పమ్మ భర్త నరసింహయ్య, నల్లని సావిత్రి భర్త కోటేశ్వరరావు, నల్లని వెంకాయమ్మ భర్త సుబ్బారావు, రావూరి సీతారావమ్మ భర్త వెంకటేశ్వర్లు, రాయల వీరమ్మ భర్త పుల్లయ్య, చెరుకూరి ఈశ్వరమ్మ భర్త నాగేశ్వరరావు లకు మెడికల్ కిట్లను అందజేశారు. చెప్పిన మాట చెప్పినట్లుగా నెరవేర్చడమే కూటమి లక్ష్యమని అందుకు ప్రత్యక్ష నిదర్శనమే ఈరోజు మార్గదర్శకుల ద్వారా బంగారు కుటుంబాలకు అందజేసిన ఈ విలువైన గృహపకరణాలు జీవనోపాధి నిమిత్తం ఆటోలు కుట్టుమిషన్లు మెడికల్ కిట్లు ఎంప్లాయిమెంట్ కార్డులని తంగిరాల సౌమ్య తెలియజేశారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డు అందుకున్న పోలేరమ్మ దేవాలయ ఆలయ కమిటీ చైర్మన్ మేస్త్రీ దొడ్డప్ప



**గుంతకల్లు ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర పట్టణంలోని దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నందు నిర్వహించిన మహనీయుల జయంతోత్సవాలను పురస్కరించుకొని వివిధ రంగాల విశిష్ట సేవలు అందించిన వారికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గుంతకల్లు పట్టణానికి చెందిన పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మేస్త్రీ దొడ్డప్ప కి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డు అందజేసి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు,జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ యాదవ్,ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు దండు వీరయ్య, టిప్పు సుల్తాన్ యూనిటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫరూక్ ఖాన్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుండి మేస్త్రీ దొడ్డప్ప పేదలకు ఆర్థిక సహాయ కార్యక్రమాలు మెడికల్ క్యాంపులు కరోనా సమయంలో పేదలకు సహాయ కార్యక్రమాలు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం వికలాంగులకు సహాయ కార్యక్రమాలు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలమన్ననలు పొందారని అలాగే ఆయన వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు సామాజిక స్పృహని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అందుకుగాను ఈ అవార్డు అందచేయడం జరిగిందని అన్నారు. అలాగే రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు బళ్లారి కెనరా బ్యాంక్ మేనేజర్ సురేష్ కుమార్,కవి జాబిల్లి చాంద్ బాషా, ఫోటోగ్రాఫర్ నీలకంఠ,రఘు,అంజి,చేంజ్ ఫర్ సొసైటీ అధ్యక్షులు జిబిబుల్ల అలాగే భారతీ రోజా తదితరులు పాల్గొన్నారు.

## అడవిలోకి చొరబడుతున్న వ్యక్తి అరెస్టు..

**పిడిలేని గొడ్డలి, బారిస స్వాధీనం..**

**మరో ఇద్దరి కోసం గాలింపు..**




**ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి) తిరుపతి జిల్లా ప్రతినిధి :** బాకరపేట ప్రాంతంలో నిషేధిత అడవుల్లోకి ప్రవేశిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి పిడిలేని ఇనుప గొడ్డలి, బారిస లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ ఎస్ ఐ వై విశ్వనాథ్ టీమ్ భాకరాపేట చామల సెక్షన్ లో కూంబింగ్ చేపట్టారు. తిరుపతి–పీలేరు రోడ్డు ఉత్తరం వైపున నిషేధిత అటవీ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు వెళుతూ కనిపించారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు అడవుల్లోకి పారిపోయారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతని వద్ద నుంచి పిడిలేని గొడ్డలి, బారిస స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు.

## విద్యారంగంపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది - ఆదిత్య రెడ్డి



**బద్వేల్ ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేలు వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్సీపి విద్యార్థి విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ. విద్యారంగంపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండి పడ్డారు. ఇంజనీరింగ్, డిగ్రీ,ఫార్మసీ, ఎంబీఏ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను చెల్లించకపోవడంపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ కూడా చైర్మన్ సింగసాని గురు మోహన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రామ సుబ్బారెడ్డి, బద్వేలుమండల కన్వీనర్ మల్లేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పుత్త శ్రీరాములు, చెన్న కృష్ణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద ఉద్యోగ విరమణ...

**సమాచార మరియు పౌరు సంబంధాల అధికారి కే సుభాషిని...**



**బాపట్ల ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** మీరు చూపిన ప్రేమ, ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల అధికారి, సహాయ సంచాలకురాలు కె సుభాషిణి తెలిపారు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందుతున్న సహాయసంచాలకురాలు సుభాషిణికి మీడియా ప్రతినిధులు స్థానిక డిఐపిఆర్ఓ కార్యాలయంలో మంగళవారం అభినందన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. శాలువలు, పుష్పగుచ్చాలతో ఆమెను మీడియా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కృష్ణానది వరద విపత్తు సమయములో బాపట్ల జిల్లాలో సమర్థంగా పనిచేయడం విజయమేనని సహాయ సంచాలకురాలు చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సహకారం మరిచిపోలేనని చెప్పారు వారి సహకారంతో ఇంతకాలం బాపట్ల జిల్లాలో పనిచేయగలిగానని తెలిపారు బాపట్ల జిల్లాలో ఎన్నికల నిర్వహణ, తుపాను సమయంలో ప్రభుత్వం నుండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రధాన పాత్ర పోషించిందని చెప్పారు ఆ సమయంలో మీ సహకారంతోనే ముందుకు సాగామన్నారు. మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియలోను వారు ఎంతో సహకారం మరువలేనిదని పేర్కొన్నారు ఒక అధికారిగా గాకుండా ఒక సోదరి వలె మీడియా వారు తోటి సహ ఉద్యోగులు చూసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు సోదర భావంతో కలిసి పనిచేయడానికి ఎన్నో అవకాశాలు కల్పించిన విషయాలను ఆమె ఈ సందర్భంగా మననం చేసుకున్నారు. ఇక్కడ పనిచేసినంతకాలం జిల్లా కలెక్టర్లందరూ ఎంతో ప్రోత్సాహం అందించారని సహాయ సంచాలకురాలు తెలియజేశారు బాపట్ల జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభవాని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సురేష్, నవీన్, ధనరాజ్, ఉమా, బాషా, తదితర మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐలో 2025-2026 సంవత్సరాలకు అడ్మిషన్లు ప్రారంభం

**గుంతకల్లు ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) నందు 2025బి 2026 సంవత్సరమునకు గాను మొదటి విడుత అడ్మిషన్స్ ప్రారంభం అయినవి. కావున 10 వ తరగతి ఉతీర్ణులైన అభ్యర్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవలయును. ఆన్లైన్ నందు దరఖాస్తు చేసుకున్న వెంటనే మీ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గరలోని ప్రభుత్వ ఐటిఐ నందు వెరిఫికేషన్ చేయించుకోవల యును. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే కౌన్సిలింగ్ కు అర్హులు అని గుంతకల్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ సిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ గుంతకల్లు, అనంతపురము జిల్లా యందు గల కోర్సులు డ్రాట్స్‌మన్ సివిల్ - 2 సంవత్సరాలు,ఎలక్ట్రీషియన్ - 2 సంవత్సరాలు,ఫిట్టర్ - 2 సంవత్సరాలు,మెకానిక్ మోటార్ వెహికల్ - 2 సంవత్సరాలు,మెకానిక్ డీజిల్ - 1 సంవత్సరం, కంప్యూటర్ ఆపరేటర్ మరియు ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (%జుూూూ)-%1 సంవత్సరం, దరఖాస్తు చేసుకోవలసిన వెబ్‌సైట్: iti.ap.gov.in దరఖాస్తులను సమర్పించు టకు చివరి తేదీ 24-05-2025

## నరసాపురం పార్లమెంట్ పరిశీలికునిగా ముదునూరి మురళీ కృష్ణంరాజు



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకునిగా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ముదునూరి మురళి కృష్ణంరాజుని నియమించారు. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ,నియోజకవర్గంలో ఆపదలో ఉన్న వారికి అపన్నహస్తం అందిస్తూ మరలా జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళీకృష్ణంరాజుని నరసాపురం పార్లమెంట్ పరిశీలకునిగా నియమించడం పట్ల అభిమానులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.లి

## మే రెండు నుండి జూన్ పదిహేనోవ తారీకు వరకు కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ ట్రైనింగ్ ప్రోగ్రాం....



**బాపట్ల ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లా కేంద్రమైన బాపట్ల పాత బస్టాండ్ వద్ద ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో కిషోరవికాసం - సమ్మర్ క్యాంప్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో బి బాబురావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యవివాహాలు గురించి స్కిల్ డెవలప్మెంట్, టోల్ ఫ్రీ నెంబర్స్ వాటిని వినియోగించే విధానం ఉమెన్ ఎంపవర్మెంట్ మరియు కిషోరి బాలికలకు అవసరమైన ముఖ్యమైన వాటి మీద ట్రైనింగ్ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు అనంతరం ట్రైనింగ్ అవగాహన కార్యక్రమం మే 2,తారీకు నుండిను జూన్ 15, వా తారీకు వరకు జరుగుతాయని ఎంపీడీవో బాబురావు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏపిఎం సురేష్ సిడిపిఓ ఎన్, లక్ష్మీపార్వతి, సూపర్వైజర్స్ ఐ సి డి సి పద్మావతి ,కుమారి ,త్రివేణి, జి ఎం ఎస్ కె ఎస్ ఆయాలు ఏఎన్ఎం ఆశా వర్కర్స్ వివోలు తదితరులు పాల్గొన్నారు

## డిసిసి బ్యాంక్ చైర్మన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి కార్యకర్తలు



**బద్వేల్ ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి న్యూస్)** కడప జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ గా ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్, టిడిపి సీనియర్ నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి నూతనంగా ఎన్నికైన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 21 .22. వార్డుల లోని టిడిపి కార్యకర్తలు అభిమానులు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పక్కీరయ్య. చాన్ భాష. పుల్లయ్య. సుబ్బరాయుడు. సుబ్రహ్మణ్యం. లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం ఘటనలో మరణించిన వారికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించిన న్యూ డెమోక్రసీ




**గుంతకల్లు ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** పట్టణంలో తేదీన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కాశ్మీర్ లోని పహల్గాం లో ఈనెల 22 తేదీన టూరిస్టుల మీద విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28ని అమానుషంగా హత్య చేయడాన్ని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తీవ్రంగా ఖండిస్తూ ఘటనలో మరణించిన 28 మందికి మంగళవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ లో ఘనంగా కొవ్వొత్తులతో నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగినది. ఈ ఘటనకు కారకులైన టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలి,మతసామరస్యా న్ని పరిరక్షించాలిని నినాదాలు చేయడం జరిగినది. సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ మాట్లాడుతూ పహల్గంలో జరిగిన సంఘటన అత్యంత బాధాకరమైన వంటిది దీనిని దేశ ప్రజలందరూ ముక్తకంఠం తో ఖండించడం జరుగుతున్న దని,టెర్రరిజన్ని మతం కోణం లో చూడకూడదు కానీ బిజెపి,ఆర్ఎస్ఎస్ హిందుత్వ సంస్థలు మతకోణంలో చూపిస్తూ ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ ఘటన మీద కొన్ని మతాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం జరుగుతున్నది. దీనివలన దేశంలో మత ఘర్షణలు జరిగే పరిస్థితి ఉన్నది. ఈ ఘటన పైన కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చర్యలు చేపట్టి టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలిని, మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి,మృతి చెందిన కుటుంబాలకు పార్టీ తరపున తీవ్ర సంతాపాన్ని తెలుపుతు న్నామని,భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యులు రఘునాథ్ రెడ్డి జిలాన్ సత్తార్ రామాంజనేయులు ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) నియోజకవర్గం కార్యదర్శి ఆశాభి,మాబున్ని, ఐ ఎఫ్ టి యు నాయకులు రాందాస్,నారాయణ,భాష, గోపి,షేక్షావలి,జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు పేదలకు వరం. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు.





**పోడూరు, ఏప్రిల్ 29,ప్రజాజ్యోతి న్యూస్.** కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదల వరం అని పోడూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. పోడూరు మండలం మినిమిచిలిపాడు గ్రామం లో మంగళవారం ఉపాధి హామీ కూలీలు, మేట్ లకు ప్రభుత్వ భీమా పథకాలు అయిన సురక్ష భీమా యోజన, జీవన్ జ్యోతి భీమా యోజన,అటల్ పెన్షన్ యోజన పథకాల గురించి ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలను 2015లోనే మొదలు పెట్టినప్పటికీ చాలామంది ప్రజలకు అవగాహన లేక దీనివల్ల లబ్ది పొందలేకపోతున్నారని, ఈ మూడు పథకాలు పేదలకు వరమని అన్నారు. 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలు లోపు వయసు కలిగిన వ్యక్తులు 436 రూపాయలు చెల్లించి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో జాయిన్ అయితే వారికి ఏదైనా కారణం చేత మరణం సంభవిస్తే రెండు లక్షల రూపాయలు బీమా సొమ్ము నామినీకి అందజేయబడుతుందని , అదే రకంగా 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాలు లోపు కలిగిన వ్యక్తులు 20 రూపాయల చెల్లించి సురక్ష బీమా యోజన పథకంలో చేరడం ద్వారా ఏదైనా ప్రమాదం చేత మరణం గానీ అంగవైకల్యం గాని జరిగితే రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా పొందుతారని అయన తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఏసుబాబు మాట్లాడుతూ ఈ పథకంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా యానిమేటర్ కొదాటి వెంకటలక్ష్మి, ఉపాధి మేస్త్రిలు గొల్ల అచ్చుతాంబ, వేమవరపు లక్ష్మీ, శాంతకుమారి,వేమవరపు వరలక్ష్మి , బొల్లా మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## దేవర ఉత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాగంటి శ్రీదేవి



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలంలో. లక్ష్మీ తాండ గ్రామంలో సేవాలాల్, మారెమ్మ ఉత్సవాలను మంగళవారం లక్ష్మీ తండా గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సేవాలాల్, మారెమ్మ,ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు, నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో స్వాగతంచి, పూలమాలతో శాలవాలతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కమిటీ నాయకులు జిట్టా నగేష్ యాదవ్, రామచంద్ర రెడ్డి, తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప తదితరులు పాల్గొన్నారు

## జిల్లా వైసీపీ స్పోర్ట్స్ పర్సన్ గా పెదపాటి రాజేష్...



**అన్నవరం ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** పిఠాపురం నియోజవర్గం పిఠాపురం నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ వార్డ్ కౌన్సిలర్ పెదపాటి రాజేష్ కుమార్ అడ్వకేట్ కు పిఠాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ వంగా గీత విశ్వనాధ్ ఆశీస్సులతో కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా డిస్టిక్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ గా నియమితులైన పెదపాటి రాజేష్ కి 16వ వార్డు ప్రజలు అభిమానులు వారికి అభినందనలు తెలియజేశారు రాజేష్ కు ఈ పదవి లభించడం పట్ల ఇచ్చినటువంటి వంగ గీత విశ్వనాథ్ కి పిఠాపురం నియోజకవర్గ ప్రజలు అభినందనలు తెలియజేశారు

# వేసవిలో అధిక వేడితో తలనొప్పి వస్తుందా?



వేసవిలో ఎండ వేడిని తట్టుకోవడం కాస్త కష్టమే. శరీరం చాలా వేడిగా ఉంటుంది. పైగా ఒత్తిడి, అలసట కారణంగా శరీరంలో అనేక మార్పులు సంభవిస్తాయి. సూర్యకాంతి శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. దీని ప్రభావం తలపై పడుతుంది. ఫలితంగా తలనొప్పి వస్తుంది. వాతావరణం వేడిగా ఉన్నప్పుడు తలనొప్పి రావడం సహజమే. వేసవిలో వచ్చే తల నొప్పిని నివారించడానికి ఇంట్లోనే సహజ పద్ధతుల్లో కొన్ని చిట్కాలు ట్రై చేయవచ్చు. ముఖ్యంగా వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో నువ్వుల నూనె చాలా సహాయపడుతుంది. ప్రతిరోజూ నువ్వుల నూనెతో తలకు సున్నితంగా మసాజ్ చేసుకోవడం వల్ల శరీరం అలసట, తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎండలో ఎక్కువ సమయం గడపడం వల్ల తలనొప్పి వస్తుంది. వీలైనంత వరకు నీడ ప్రాంతాల్లో ఉండటానికి ప్రయత్నించాలి. తలనొప్పిని నివారించడానికి తొలుత ఎండకు దూరంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. ఇది తలనొప్పిని నివారిస్తుంది. ఒకవేళ ఎండలో బయటకు వెళ్ళవలసి వస్తే, గొడుగు తీసుకెళ్లడం లేదా తలపై స్కార్ఫ్ లేదా టోపీ ధరించడం మంచిది. ఇటువంటి ముందు జాగ్రత్త చర్యలు తలనొప్పిని నివారించడంలో సహాయపడతాయి. ఈ వేసవిలో ఎండ వల్ల వచ్చే తలనొప్పికి ఇంట్లోనే ఈ కింది విధంగా చికిత్స తీసుకోండి.. తులసి, అల్లంతో తయారు చేసిన టీ తయారు చేసి తాగాలి. ఎందుకంటే ఈ టీ తలనొప్పిని తగ్గించడానికి దివ్య ఔషధంగా పనిచేస్తుంది. ఈ టీ తాగడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. ఎందుకంటే ఇది పూర్తిగా సహజమైనది.అలాగే మజ్జిగ కూడా ప్రభావ వంతంగా పనిచేస్తుంది. దీన్ని తాగడం వల్ల తలనొప్పి తగ్గుతుంది. వేసవిలో చల్లని మజ్జిగ తాగడం వల్ల శరీరం చల్లబడటమే కాకుండా దాహం కూడా తీరుతుంది. ఇది శరీరంలో నీటి నిలుపుదలని పెంచడానికి సహాయపడుతుంది. మజ్జిగ తాగడం వల్ల తలనొప్పి, అలసట తగ్గుతాయి. తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాలు తినాలి. అవును.. మజ్జిగ, చల్లని పండ్లు, సలాడ్లు వంటి ఆహారాలు శరీరాన్ని హైడ్రేట్ చేస్తాయి. అవి శరీర ఉష్ణోగ్రతను కూడా తగ్గిస్తాయి.తగిన విశ్రాంతి అవసరం. శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వడం ద్వారా తలనొప్పిని తగ్గించుకోవచ్చు. విశ్రాంతి సమయంలో శరీరం ఉత్తేజితమై ప్రశాంతంగా ఉంటుంది. అలాంటి విశ్రాంతి తలనొప్పి తీవ్రతను తగ్గిస్తుంది. యోగా, ప్రాణాయామం చేయాలి. ఇది వెంటనే తగ్గకపోయినా, భవిష్యత్తులో తలనొప్పి రాకుండా చేస్తుంది. వ్యాయమాలు శరీరాన్ని ప్రశాంతపరుస్తాయి. రక్త ప్రసరణను మెరుగుపరచడం ద్వారా తలనొప్పిని నివారిస్తాయి. ముఖ్యంగా వేసవిలో వ్యాయామాలు చేయడం వల్ల శరీరం వేడెక్కకుండా ఉంటుంది.

# ముంజలు తినకపోతే ఎట్లాగండి?



ఎండాకాలంలో లభించే తాటి ముంజలు ఆరోగ్య పరంగా అమృతమే అంటున్నారు ఆయుర్వేద నిపుణులు. శరీరాన్ని చల్లబరచడానికి, డీహైడ్రేషన్ నివారించడానికి, రోగ నిరోధక శక్తిని పెంపొందిచడానికి ముంజలు సహాయపడతాయట. విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు తాటి ముంజల ద్వారా శరీరానికి లభిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను నుంచి మనకు రక్షణ కల్పిస్తాయి. భానుడి భగభగలు రోజురోజుకు పెరిగిపోతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అందరూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ కీలక సూచన చేసింది. దీంతో చాలామంది సమ్మర్ డైట్ ఫాలో అవుతున్నారు..వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. మధ్యాహ్నా వేళల్లో అత్యవసరమైతే బయటకు వస్తున్నారు. ఇంట్లో చల్లటి పానీయాలు తాగుతూ రెస్ట్ తీసుకుంటున్నారు. మరోవైపు వేసవి స్పెషల్ తాటి ముంజలను జనం ఇష్టంగా తింటున్నారు. అసలే మండే ఎండాకాలం.. ఇంట్లో నుంచి బయటికి వెళ్తే ఎండ దెబ్బతో బాడీ డిహైడ్రేషన్ గురవుతుంటి. అలాంటి సమయాల్లో తాటి ముంజలు తింటే మస్త్ రిలీఫ్ ఉంటుందంటున్నారు సిద్ధిపేట జిల్లా వాసులు. హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ, పొట్లపల్లి గ్రామాల్లో భారీగా తాటి వనాలు ఉన్నాయి. మండే వేసవిలో సూర్యుని భగభగను తట్టుకునేందుకు తాటి ముంజలతో చెక్ పెడుతున్నారు ఇక్కడి స్థానికులు. చిన్నా, పెద్ద తేడా లేకుండా తాటి వనాల్లోకి వెళ్లి తాటి ముంజలను లొట్టలేసుకుంటూ తింటున్నారు. సహజ సిద్ధంగా ఈ ఎండాకాలంలో మాత్రమే దొరికే తాటి ముంజలకు భలే డిమాండ్ ఏర్పడింది. ఈ తాటి ముంజల్లో క్యాలరీలు ఎక్కువ మొత్తంలో ఉంటాయని శరీరానికి కావలసిన శక్తిని అందిస్తాయని, బాడిలో ఉన్న హీట్‌ను బాగా తగ్గిస్తుంది అంటున్నారు స్థానికులు. 100 రూపాయలకు డజన్ తాటి ముంజలను అమ్ముతూ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు ఇక్కడి గీత కార్మికులు. చాలామంది ముంజలపై గోధుమ రంగులో ఉండే పొట్టు తీసేసి తింటారు. కానీ ఆ పొట్టులోనే ఎన్నో రకాల పోషకాలుంటాయని, ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

# ఈ వ్యాధులకు చెక్‌పెట్టే జాస్మిన్..




నేటి కాలంలో ప్రజలు రెండు ప్రధాన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకటి మందులకు పెరుగుతున్న నిరోధకత, మరొకటి శరీరంలోని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే ఆక్సీకరణ ఒత్తిడి. మొదటి సమస్య ఏమిటంటే అనేక బ్యాక్టీరియా, శిలీంధ్రాలు మందులకు వ్యతిరేకంగా పోరాడటం నేర్చుకున్నాయి. దీని వలన చికిత్స కష్టమవుతుంది. మరోవైపు ఫ్రీ రాడికల్స్ మన శరీర కణాలను దెబ్బతీస్తాయి. ఇది వృద్ధాప్యం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. ఈ సమస్యల చికిత్సకు యాంటీఆక్సిడెంట్లు చాలా ముఖ్యమైనవి. అల్లోపతిలో దీనికి చాలా మందులు ఉన్నాయి. కానీ మల్లెలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించే అనేక లక్షణాలు ఉన్నాయని, ఇందులో మంచి మొత్తంలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయని మీకు తెలుసా? పతంజలి పరిశోధనా సంస్థ మల్లెపూల ప్రయోజనాలపై పరిశోధన చేసింది. ఆయుర్వేదంలో ఉపయోగించే మల్లె మొక్క యాంటీబయాటిక్ నిరోధకత, ఆక్సీకరణ ఒత్తిడి రెండింటినీ ఎదుర్కోగలదని పరిశోధనలో తేలింది. ఇది ఈ రెండు సమస్యలను నియంత్రిస్తుంది. జాస్మిన్‌లో వివిధ రకాలు ఉన్నాయి. ఇది బ్యాక్టీరియా, ఫంగస్, ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించడంలో చాలా సహాయపడుతుంది. పరిశోధన ప్రకారం.. ఈ ఔషధ మొక్క సురక్షితమైన, ప్రభావవంతమైన ఔషధ వనరుగా ఉంటుంది. టానిన్లు, ఆల్కలాయిడ్స్, ఫినోలిక్స్, ఫ్లేవనాయిడ్లు వంటి మొక్కలలో కనిపించే మూలకాలు బ్యాక్టీరియా, శిలీంధ్రాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. వాటిని నియంత్రించి, శరీరానికి వాటి వల్ల కలిగే నష్టాన్ని కూడా తగ్గుతుంది. మన శరీరం ఆక్సిజన్ ద్వారా స్వేచ్ఛా రాడికల్స్‌ను సృష్టిస్తుంది. ఇవి శరీరానికి కొంత వరకు అవసరం. ఫ్రీ రాడికల్స్ అధికంగా ఉత్పత్తి కావడం వల్ల ఐచీూ విచ్ఛిన్నమవుతుంది. ప్రోటీన్లు దెబ్బతింటాయి. కొవ్వులపై ఆక్సీకరణ ప్రభావం ఉంటుంది. ఇదే క్యాన్సర్, గుండె జబ్బులు, అనేక వయస్సు సంబంధిత సమస్యలకు మూల కారణం. క్యాన్సర్ రావడానికి ఒక ప్రధాన కారణం ఫ్రీ రాడికల్స్ ఏర్పడటం పెరగడం. మల్లె మొక్కల నుండి లభించే యాంటీఆక్సిడెంట్లు ఈ పరిస్థితిని చాలా వరకు నయం చేయగలవు. ఉదాహరణకు.. ప్రూనస్ డొమెస్టికా, సిజిజియం కుమిని వంటి పండ్లలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరిస్తాయి.

# పచ్చిగుడ్డుతో తయారయ్యే ఈ క్రీమ్ ఇంకా తింటున్నారా



సాండ్‌విచ్‌ల రుచిని పెంచాలన్నా, ఫ్రెంచ్ ఫ్రైస్‌ను మరింత ఇష్టంగా తినాలన్నా చాలామంది మయోనైజ్‌ను నంచుకుంటారు. పిల్లలే కాదు, పెద్దలు కూడా దీన్ని ఎంతో ఇష్టంగా తింటారు. కొన్ని సలాడ్‌లు, సాస్‌లలోనూ కలుపుకొని ఆస్వాదిస్తారు. క్రీమీగా, తియ్యగా కాస్త వెరైటీగా ఉండే మయోనైజ్ అందరికీ అంత ప్రియమైనది. రుచి బాగుందని తింటున్నారే కానీ, ఇది ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తుందని తాజాగా తమిళనాడు ప్రభుత్వం తేల్చి చెప్పింది. అక్కడ మయోనైజ్ వాడకాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అంతేకాదు, మయోనైజ్‌ను హై రిస్క్ ఫుడ్‌గా ప్రకటించింది. అంటే ఇది ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు. రుచికరంగానే ఉన్నప్పటికీ ఇది నెమ్మదిగా శరీరానికి విషంలా మనుషుల ఆరోగ్యాన్ని పూర్తిగా పాడు చేస్తోంది. అధికారులు మయోనైజ్‌లో హానికరమైన బ్యాక్టీరియాలను గుర్తించారు. సల్మోనెల్లా టైఫిమురియం, సల్మోనెల్లా ఎంటరైటిడిస్‌తో పాటు ఈ కోలి బ్యాక్టీరియాలు మయోనైజ్‌లో ఉంటున్నాయి. అందుకే వెంటనే దాని వాడకాన్ని నిషేధించారు. అసలు మయోనైజ్‌ను వేటితో తయారు చేస్తారు?
మయోనైజ్‌లో ముఖ్యంగా రెండు పదార్థాలుంటాయి: ఒకటి నూనె అయితే మరొకటి గుడ్డు పచ్చసొన. గుడ్డు పచ్చసొనలో ఉండే లెసిథిన్ అనే ఫ్యాట్ మయోనైజ్‌కు చిక్కదనాన్ని ఇస్తుంది. అయితే ఇందులో వెనిగర్, నిమ్మరసంతో పాటు రకరకాల ఫ్లేవర్స్‌ను కలుపుతారు. ఇవన్నీ రుచి కోసం కలిపేవే. కానీ మయోనైజ్‌లో దాదాపు 80 శాతం నూనె ఉంటుంది. నూనెతో రిస్క్ తక్కువే అయినా, సమస్యంతా గుడ్డు పచ్చసొనతోనే. ప్రతి గుడ్డులోనూ ఈ బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. అయితే మనం గుడ్డును ఉడకబెట్టడం లేదా ఆమ్లెట్‌లా వేసుకోవడం లాంటివి చేస్తాం కాబట్టి ఆ ప్రభావం తగ్గిపోతుంది. గుడ్డు పెంకు ఏర్పడే సమయానికే ఈ బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశముంటుంది. కొన్నిసార్లు పెంకుపై ఉన్న బ్యాక్టీరియా లోపలి సొనలోకి కూడా చేరుతుంది. సరైన విధంగా దీన్ని వండకపోతే ఆ బ్యాక్టీరియా చనిపోకుండా అలాగే ఉంటుంది. పైగా వాసనలో కానీ, రంగులో కానీ ఎలాంటి మార్పు ఉండదు. అందుకే అందులో బ్యాక్టీరియా ఉన్న విషయం కూడా మనకు తెలియకుండా వాడేస్తాం. గుడ్లను సరైన విధంగా నిల్వ చేయకపోయినా ఇలాంటి ఇబ్బందులు వస్తాయి.
ఈ గుడ్లలోని పచ్చసొనతో మయోనైజ్ తయారు చేయడం వల్లే చాలామంది అనారోగ్యాల బారిన పడుతున్నారు. చాలా చోట్ల సరైన క్వాలిటీ చెక్ లేకుండా మయోనైజ్‌ను తయారు చేస్తున్నారు. ఈ సల్మోనెల్లా బ్యాక్టీరియా కారణంగా డయేరియా, జ్వరం, వాంతులు లాంటి ఇబ్బందులు వస్తాయి. కొన్నిసార్లు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. కలుషితమైన గుడ్ల నుంచే ఇది వ్యాప్తి చెందుతుంది. గుడ్డుతో తయారు చేసే పదార్థాలు ఏవైనా సరే వాటిని సరైన విధంగా నిల్వ చేయాలి. రిఫ్రిజిరేషన్ ఎలా ఉందనే దానిపై ఆ ఆహార పదార్థం ఎన్ని రోజుల పాటు నిల్వ ఉంటుందనేది ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే అందులో సల్మోనెల్లా బ్యాక్టీరియా పదింతలు అవుతుంది. నిజానికి ఈ బ్యాక్టీరియా తక్కువ పరిమాణంలో ఉంటే పెద్దగా ఇబ్బంది ఉండదు. ఎందుకంటే అలాంటి బ్యాక్టీరియాను చంపే శక్తి మన పొట్టలోని యాసిడ్‌కు ఉంటుంది. ఫుడ్ పాయిజన్ కాకుండా కాపాడుతుంది. కానీ ఫ్రిజ్‌లో పెట్టకుండా రూమ్ టెంపరేచర్‌లో ఉంచిన మయోనైజ్‌లో బ్యాక్టీరియా విపరీతంగా ఉంటుంది. అది తిన్న వెంటనే ప్రభావం చూపిస్తుంది. గుడ్డుపై విపరీతంగా మరకలున్నా, పాడైపోయినట్టు కనిపించినా వెంటనే పారేయాలి. పెంకు కాస్త పగిలి ఉన్నా సరే అందులోకి సల్మోనెల్లా బ్యాక్టీరియా చేరుకునే ప్రమాదముంటుంది. ఎప్పుడూ గుడ్లను నీళ్లతో కడగకూడదు. ఇలా చేస్తే పైన ఉన్న బ్యాక్టీరియా లోపలికి వెళ్తుంది. ఏ మాత్రం తేడాగా అనిపించినా వెంటనే పారేయండి. గుడ్లను కచ్చితంగా ఫ్రిజ్‌లోనే ఉంచాలి. ఫ్రిజ్‌లో ఎగ్స్ కోసం ఇచ్చే బాక్స్‌లోనే వాటిని స్టోర్ చేయాలి. అయితే ఇలా తీసుకొచ్చిన ఎగ్స్‌ను మరీ ఎక్కువ రోజుల పాటు అలాగే స్టోర్ చేయడం కూడా కరెక్ట్ కాదు. వారం రోజుల్లోనే వాటిని వాడేలా చూసుకోవాలి.

# కాల్షియం లోపిస్తే కనిపించే లక్షణాలు



మన శరీరానికి కాల్షియం చాలా ముఖ్యం. కాల్షియం లోపం ఎముకలను బలహీనపరుస్తుందని సాధారణంగా భావిస్తుంటాము. కాల్షియం లోపం అనేక ఇతర రకాల సమస్యలను కలిగిస్తుంది. మన శరీరం అధిక నాణ్యత, అత్యుత్తమ సాంకేతికత కలిగిన యంత్రం. శరీరంలో ఏదైనా లోపం లేదా సమస్య ఉంటే, శరీరం మనకు సంకేతాలను ఇస్తుంది. కాల్షియం లోపం ఉన్నప్పుడు కూడా మన శరీరం మనకు సంకేతాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది. ఈ సంకేతాలను లక్షణాలు అంటారు. శరీరంలో కాల్షియం లేకపోవడం వల్ల హైపోకాల్సెమియా వస్తుంది. కాల్షియం మన శరీరంలోని ఎముకల బలం, అభివృద్ధికి మాత్రమే బాధ్యత వహించదు. కాల్షియం మన శరీరంలో కండరాల సంకోచం, నాడీ వ్యవస్థ, రక్తం గడ్డకట్టడంపై కూడా పనిచేస్తుంది. శరీరంలో కాల్షియం లోపం ఉంటే, అనేక రకాల సమస్యలు వస్తాయి. ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే, తీవ్రమైన అనారోగ్యం సంభవించవచ్చు. అందుకే ప్రారంభ లక్షణాలను గుర్తించడం ద్వారా కాల్షియం లోపాన్ని తొలగించాలి. శరీరంలో కాల్షియం లోపం వల్ల తక్కువ రక్తపోటు, చేతులు, కాళ్ళు, ముఖం కండరాలలో తిమ్మిరి, చేతులు, కాళ్ళలో జలదరింపు లేదా తిమ్మిరి, మీరు బలహీనంగా లేదా అలసిపోయినట్లు అనిపించవచ్చు. అలాగే మాట్లాడటం లేదా మింగడంలో ఇబ్బంది పడవచ్చు. దీనితో పాటు, నిరాశ, ఆందోళన, చిరాకు కూడా సంభవించవచ్చు. మీరు నడవడానికి ఇబ్బందిగా అనిపించవచ్చు. దీనితో పాటు, పొడి చర్మం, క్రమరహిత హృదయ స్పందన కూడా దాని లక్షణాలు కావచ్చు. కాల్షియం లోపం ఉన్నప్పుడు ఈ లక్షణాలు ఖచ్చితంగా కనిపిస్తాయి. కొన్నిసార్లు ఒకటి, రెండు లేదా మూడు లేదా నాలుగు లక్షణాలు కనిపించవచ్చు. పైన పేర్కొన్న లక్షణాలలో ఏవైనా ఒకటి లేదా రెండు వారాల పాటు మీరు ఎదుర్కొంటుంటే, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో కాల్షియం లోపం ఉన్నప్పుడు లక్షణాలు వెంటనే కనిపించవు. లోపం కొనసాగితే లక్షణాలు బయటపడతాయి. అందుకే లక్షణాలు కనిపించినప్పుడు వైద్యుడిని సందర్శించడంలో ఆలస్యం చేయకూడదు. దీనితో పాటు, శరీరంలో కాల్షియం లోపాన్ని నివారించడానికి, పాలు, పెరుగు, కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి.

## బిజినెస్

### భద్రత కోసం రూ.70 కోట్లు!
### సుందర్ పిచాయ్ జీతం ఎంతంటే?



ప్రపంచంలోని దిగ్గజ కంపెనీల సీఈఓల గురించి తెలుసుకునే చాలామంది.. మొదట సెర్చ్ చేసే విషయం జీతమే. ఎందుకంటే వారి వేతనాలు కోట్ల రూపాయల్లో ఉంటాయి. ఇప్పుడు తాజాగా 2024లో సుందర్ పిచాయ్ జీతానికి సంబంధించిన విషయాలు వెల్లడయ్యాయి. దీని గురించి మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. ఆల్ఫాబెట్ 2025 ప్రాక్సీ స్టేట్‌మెంట్ ప్రకారం, సుందర్ పిచాయ్ వేతనం 2024లో 10.73 మిలియన్ డాలర్లు (రూ. 91.4 కోట్లు). ఇందులో ఎక్కువ భాగం స్టాక్ అవార్డ్స్, ఇతర పరిహారాల రూపంలో అందింది. కాగా ఈయన బేసిక్ శాలరీ 2 మిలియన్ డాలర్లు (రూ. 17.04 కోట్లు). సాధారణ ఉద్యోగి జీతంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. 2023లో పిచాయ్ వేతనం 8.8 మిలియన్ డాలర్లు మాత్రమే. జీతం విషయం పక్కన పెడితే.. సుందర్ పిచాయ్ భద్రత కోసం ఆల్ఫాబెట్ కంపెనీ ఏకంగా 8.27 మిలియన్ డాలర్లను (రూ. 70.45 కోట్లు) ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. అంతకు ముందు ఏడాది సంస్థ భద్రత కోసం చేసిన ఖర్చు 6.78 మిలియన్ డాలర్లు. అంటే సెక్యూరిటీ కోసం.. కంపెనీ అంతకు ముందు సంవత్సరం కంటే 22 శాతం ఎక్కువ ఖర్చు చేసింది. కంపెనీ అందించే భద్రతా ప్యాకేజీలో.. ఇంటి నిఘా, ప్రయాణ రక్షణ, వ్యక్తిగత డ్రైవర్లు వంటివన్నీ ఉంటాయి. అయితే దీనిని సంస్థ సుందర్ పిచాయ్ వ్యక్తిగత ప్రయోజనంగా కాకుండా.. ఉద్యోగ భద్రతలో భాగంగానే భావిస్తుంది. నిజానికి, సీఈఓ సుందర్ పిచాయ్ జీతం సగటు ఉద్యోగి జీతం కంటే దాదాపు 32 రెట్లు ఎక్కువ.

### ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం
### మరో 195 మంది ట్రైనీలు




2025లోనూ లేఆఫ్స్ పర్వం కొనసాగుతూనే ఉంది. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ వరుస తొలగింపులు చేపడుతూనే ఉంది. తాజాగా మరో 195 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ ఏడాదిలోనే ట్రైనీలను తొలగించడం వరుసగా నాలుగోసారి కావడం గమనార్హం. ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా 195 మందిని తొలగించినట్లు తెలుస్తోంది. వీరందరికీ కంపెనీ ఈ మెయిల్స్ ద్వారా సమాచారం అందించినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 2025 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు సంస్థ సుమారు 800 మంది ట్రైనీలను తొలగించింది. భారతదేశంలో రెండవ అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఏప్రిల్ 18న దాదాపు 240 మందిని తొలగించగా, అంతకు ముందు ఫిబ్రవరిలో 300 మందికి పైగా ట్రైనీలను, మార్చిలో 30 నుంచి 35 మందిని తొలగించింది. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్‌గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్‌ను కూడా సంస్థ అందిస్తోంది. ఇన్ఫోసిస్ కంపెనీ తొలంగించిన ట్రైనీలందరినీ.. 2022లో నియమించుకుంది.

## ఇంటర్నెట్, వైఫై లేకుండానే లైవ్‌టీవీ..
# ఫోన్స్ తెచ్చేందుకు హెచ్‌ఎండీ, లావా రెడీ



మొబైల్‌లో టీవీ చూడాలంటే మొబైల్ డేటా అయినా ఉండాలి.. లేదంటే వైఫై కనెక్షన్ అయినా ఉండాలి. ఈ రెండూ లేకుండానే మొబైల్‌లో టీవీ ప్రసారాలు చూడగలిగితే? అవును మీరు విన్నది నిజమే! ఈ తరహా మొబైల్స్‌ను తీసుకొచ్చేందుకు రెండు మొబైల్ తయారీ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. గతంలో నోకియా పేరుతో ఫోన్లు తయారుచేసే హెచ్‌ఎండీ సంస్థ.. ఫ్రీస్ట్రీమ్ టెక్నాలజీస్, ఇతరులతో కలిసి డీ2ఎం ఫోన్లు మార్కెట్లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. లావా ఇంటర్నేషనల్ సైతం డీ2ఎం ఫీచర్ ఫోన్‌ను లాంచ్ చేయనున్నట్లు ప్రకటించింది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ 2025 ఈవెంట్ వేళ ఈ రెండు కంపెనీల నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. డీ2ఎం సేవలను అందించడానికి హెచ్‌ఎండీ సంస్థ ఫ్రీస్ట్రీమ్ టెక్నాలజీస్, తేజస్ నెట్‌వర్క్స్, సింక్లెయిర్‌తో కలిసి మొబైల్ ఫోన్‌ను రూపొందించింది. దీన్ని వేవ్స్ 2025 ఈవెంట్‌లో ప్రదర్శించనుంది. మే 1 నుంచి నాలుగు రోజుల పాటు ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్ వేదికగా ఈ ఈవెంట్ జరగనుంది. లావా కూడా ఇన్‌హౌస్ ఆర్అండ్‌డీ టీమ్‌తో పాటు తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిపి ఫీచర్ ఫోన్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. మీడియాటెక్ ఎంటీ6261 ప్రాసెసర్, శాంఖ్య రూపొందించిన ఎస్ఎల్3000 చిప్‌తో ఈ మొబైల్ పనిచేస్తుంది. టీవీ ప్రసారాల కోసం యూహెచ్ఎఫ్ యాంటెన్నా ఉంటుంది. 2.8 అంగుళాల క్యూవీజీఏ డిస్‌ప్లే, 2,200 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫీచర్‌లో అమర్చారు.

**ఏమిటీ టెక్నాలజీ?**

మొబైల్ ఫోన్లలో ఎఫ్ఎం రేడియో ప్రసారాల తరహాలో టీవీ కార్యక్రమాలు అందించడమే డైరెక్ట్-టు-మొబైల్ (డీ2ఎం) పరిజ్ఞానం. దీన్ని పూర్తిగా దేశీయంగా రూపొందించారు. దీనికి వైఫై, ఇంటర్నెట్ వంటివి ఏవీ అవసరం లేదు. ఇప్పటికే పలు నగరాల్లో దీనికి సంబంధించిన ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. త్వరలో పెద్ద సంఖ్యలో ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. మొబైల్ టీవీ ప్రసారాలతో పాటు అత్యవసర హెచ్చరికలకూ డీ2ఎం పరిజ్ఞానాన్ని వాడుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## భారీ ధర పలుకుతున్న బంగారం!
# అక్షయ తృతీయ రోజున భారీ కొనుగోళ్లు జరిగేనా?



భారతీయులకు బంగారం ఎంటే ఎంతో మక్కువ. వివాహాలు, ఇతర శుభాకార్యాల సమయంలో పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా అక్షయ తృతీయ రోజున పెద్ద ఎత్తున పసిడిని కొనుగోలు చేస్తుంటారు. అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు సెంటిమెంట్‌గా మారింది. ప్రస్తుతం, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. గత కొద్దిరోజులుగా ధరలు గణనీయంగా తగ్గుతూ వచ్చాయి. వ్యాపారులు లాభాల స్వీకరణకు దిగడం, డాలర్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులున్నాయి. అయినప్పటికీ అక్షయ తృతీయ రోజున భారతీయులు పెద్ద సంఖ్యలో బంగారం కొంటారని బులియన్ మార్కెట్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలుదారులు అవసరానికి అనుగుణంగా ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారని.. తేలికపాటి ఆభరణాల నుంచి గోల్డ్ ఈటీఎఫ్స్, డిజిటల్ గోల్డ్, బార్‌లతో సహా కాయిన్స్ వరకు వివిధ రకాలుగా బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ నెల 30న అక్షయ తృతీయ రోజున ధరలను పరిశీలిచి బంగారం కొనాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవచ్చని ఆభరణాల వ్యాపారులు పేర్కొంటున్నారు. పీఎన్‌జీ జ్యువెల్లర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ గాడ్గిల్ మాట్లాడుతూ.. బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ.. వినియోగదారుల సెంటిమెంట్ బలంగానే ఉందని పేర్కొన్నారు. అక్షయ తృతీయ రోజున బంగారం అమ్మకాలు పెరుగుతాయని తాము ఆశిస్తున్నామని తెలిపారు. అయితే, అధిక ధరలు గత సంవత్సరంతో పోలిస్తే వాల్యూమ్ వృద్ధిని తగ్గించవచ్చని.. విలువ పెరుగుదల కారణంగా ఇది భర్తీ చేయబడుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అమ్మకాలపై ఎలాంటి ఒత్తిడిని కనిపించడం లేదని, దాంతో పాటు ముఖ్యంగా ప్రపంచ అనిశ్చితి దృష్ట్యా బంగారాన్ని సురక్షితమైన, నమ్మదగిన పెట్టుబడిగా చూస్తున్నారన్నారు. ఈ పండగ సీజన్‌లో బలమైన అమ్మకాలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నాణేలు, బార్ బుకింగ్ చాలాకాలం కిందట జరిగిందని ఇండియన్ బులియన్ అండ్ జ్యువెలరీ అసోసియేషన్ జాతీయ ప్రతినిధి కుమార్ జైన్ చెప్పారు. కానీ, గత సంవత్సరం కంటే చాలా తక్కువ. అయినప్పటికీ, అక్షయ తృతీయ నాడు అమ్మకాలు ఉండవచ్చని ఆశిస్తున్నారు. జవేరి బజార్‌లోని బీడీ బ్యాంగిల్స్ శ్రేయాస్ కొఠారి మాట్లాడుతూ.. ఈ సందర్భంగా వినియోగదారులు షాపింగ్ చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## శతకాలతో రెచ్చిపోతున్న చిచ్చరపిడుగులు..
# నలుగురిలో కామన్‌పాయింట్ అదే!



'బ్రహ్మయ్యకు అర్థం కాని తలరాతలు కుర్రాళ్లు.. బ్రహ్మాండం బద్ధలు కొట్టే అణుబాంబులు కుర్రాళ్లు' అని అన్నాడో సినీకవి. అతడు చెప్పినట్టే ఈకాలం కుర్రాళ్లు ఏరంగంలోనే ఇరగదీస్తున్నారు. ముఖ్యంగా క్రికెట్ విషయానికొస్తే ఐపీఎల్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లతో వీరంగం సృష్టిస్తున్నారు. వరల్డ్ క్లాస్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ.. సిక్సర్లు, ఫోర్లతో మెరుపు శతకాలు బాదేస్తున్నారు. సోమవారం జైపూర్‌లో వైభవ్ సూర్యవంశీ సునామీలా విరుచుకపడి రికార్డు సెంచరీ కొట్టేశాడు. కేవలం 35 బంతుల్లోనే ఈ చిచ్చరపిడుగు వందతో గర్జించాడు. దాంతో, ఐపీఎల్ చరిత్రలోనే రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. 18వ ఎడిషన్‌లో మూడంకెల స్కోర్ సాధించిన నాలుగో క్రికెటర్‌గా నిలిచాడీ కుర్రాడు. ఈసారి ఐపీఎల్‌లో విశేషం ఏంటంటే.. నలుగురు శతక వీరులు భారత్‌కు చెందినవాళ్లే. వీళ్లలో కామన్ పాయింట్ ఏంటంటే.. వీళ్లందరి వయసు 27 ఏళ్ల లోపే. పైగా ఈ యంగ్‌స్టర్స్ 220 ప్లస్ స్ట్రయిక్ రేటుతో సెంచరీ కొట్టారు. వయసురీత్యా వీళ్లలో 14 ఏళ్ల వైభవ్ అందరికంటే చిన్నవాడు. అభిషేక్ శర్మ ప్రియాన్ష్ ఆర్యలకు 24 ఏళ్లు మాత్రమే. ఇషాన్ కిషన్‌కు 26 ఏళ్లు.

**విధ్వంసక బ్యాటింగ్‌తో**

ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు ఇషాన్ కిషన్ తొలి సెంచరీతో చెలరేగాడు. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో ఈ యువకెరటం రఫ్ఫాడించాడు. తన విధ్వంసక బ్యాటింగ్‌తో ఐపీఎల్‌లో కెరీయర్లో మొదటిసారి మూడంకెల స్కోర్ సాధించాడు. 225.53 స్ట్రయిక్ రేటుతో ఆడిన ఇషాన్ 42 బంతుల్లో 103 రన్స్ చేశాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. ఈ సీజన్‌లో రెండో సెంచరీ వీరుడు ప్రియాన్ష్ ఆర్య. ఈ పంజాబ్ కింగ్స్ ఓపెనర్ మెరుపు బ్యాటింగ్‌తో వంద బాదేశాడు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లను ఉతికారేసిన ప్రియాన్ష్.. 245.23 స్ట్రయిక్ రేటుతో ఆడి 7 ఫోర్లు, 9 సిక్సర్లతో శతకం పూర్తి చేసుకున్నాడు.

**అభిషేక్ అలజడి**

ఐపీఎల్‌లో విధ్వంసక ఓపెనర్‌గా పేరొందిన అభిషేక్ శర్మ 18వ ఎడిషన్‌లో తన సెంచరీ కలను సాకారం చేసుకున్నాడు. ఉప్పల్ స్టేడియంలో అలజడి సృష్టించిన అతడు మెరుపు శతకం బాదాడు. పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 245 పరుగుల ఛేదనలో రెచ్చిపోయిన అభిషేక్.. 141 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ ధాటికి పంజాబ్ బౌలర్లు 14 ఫోర్లు, 10 సిక్సర్లు సమర్పించుకున్నారు. 256.36 స్ట్రయిక్ రేటుతో చెలరేగిన అభిషేక్ .. ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యధిక స్కోర్ నమోదు చేశాడు.

**సిక్సర్ల జడివాన**

జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్లను చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీ సెంచరీతో విజృంభించాడు. 14 ఏళ్లకే ఐపీఎల్‌లో శతకం బాదిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. సిక్సర్లు, ఫోర్లతో రెచ్చిపోయిన వైభవ్.. 17 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత కూడా అదే జోరు చూపిస్తూ గుజరాత్ పేసర్లు ఇషాంత్, కరీమ్ జన్నత్ బౌలింగ్‌లో సిక్సర్ల వర్షం కురిపించాడు. మరో 18 బంతుల్లోనే అంటే.. 35 బంతుల్లోనే వందకు చేరువయ్యాడీ చిచ్చరపిడుగు. రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఫైన్ లెగ్ దిశగా సిక్సర్ సాధించి సెంచరీ అభివాదం చేశాడు. తద్వారా ఈ మెగా లీగ్‌లో రెండో వేగవంతమైన సెంచరీ రికార్డు సొంతం చేసుకున్నాడీ లెఫ్ట్ హ్యాండర్. అయితే.. 30 బంతుల్లోనే శతకం బాదిన మాజీ ఆర్సీబీ ఓపెనర్ క్రిస్ గేల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

### ఐపీఎల్ రికార్డు బ్రేకర్‌కు రివార్డు..
### 10 లక్షలు ఇవ్వనున్న బిహార్ సీఎం



ఐపీఎల్‌లో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ పై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా భవిష్యత్ స్టార్ అంటూ మాజీ క్రికెటర్లు 14 ఏళ్ల వైభవ్‌కు కితాబులిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అభినందనలు తెలిపారు. తమ రాష్ట్రం ఖ్యాతిని యావత్ ప్రపంచం విస్తరించిన వైభవ్‌కు ప్రైజ్‌మనీ ప్రకటించారు. చిన్నవయసులోనే రికార్డులు బద్ధలు కొట్టిన అతడికి రూ.10 లక్షల రికార్డు ఇస్తామని సీఎం వెల్లడించారు. 'వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. ఐపీఎల్ చరిత్రలో రికార్డు సెంచరీ బాదిన అతడికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. తన శ్రమ, ప్రతిభతో ఐపీఎల్లో సంచనంగా మారాడు. భారత క్రికెట్ జట్టుకు భవిష్యత్ తారగా ఆవతరించాడు. ఐపీఎల్‌లో వైభవ్ ప్రదర్శన పట్ల మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం' అని నితీశ్ ప్రకటనలో తెలిపారు.

**12 ఏళ్లకే రంజీల్లో**

బిహార్‌కు చెందిన వైభవ్‌కు.. చిన్నప్పట్నుంచీ క్రికెట్ అంటే ఇష్టం. కోచ్ మనీశ్ ఓఝా సలహాలతో రాటుదేలిన ఈ కుర్రాడు 12 ఏళ్లకే రంజీల్లో అరంగేట్రం చేశాడు. బిహార్ తరఫున ఖతర్నాక్ ఇన్నింగ్స్‌లు ఆడి ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిలో పడ్డాడు. మెగా వేలంలో రాజస్థాన్ ఫ్రాంచైజీ అతడిని రూ.1.1 కోట్లకు కొన్నది.

## స్పోర్ట్స్

# ఇంగ్లండ్ కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్..




ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్‌గా స్టార్ ఆల్‌రౌండర్ నాట్ స్కైవర్-బ్రంట్ ఎంపికైంది. ఈ విషయాన్ని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మంగళవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. హీథర్ నైట్ స్ధానాన్ని స్కైవర్ బ్రంట్ భర్తీ చేయనుంది. కాగా ఈ ఏడాది మార్చిలో ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్సీ హీథర్ నైట్ రాజీనామా చేసింది. మహిళల యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ ఘోర పరాజయం పాలవ్వడంతో నైట్ ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ప్రధాన కోచ్ జాన్ లూయిస్‌పై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వేటు వేసింది. అతడి స్ధానంలో మాజీ కెప్టెన్ చార్లెట్ ఎడ్వర్డ్స్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నియమించింది. ఇక ఇంగ్లండ్ కెప్టెన్‌గా ఎంపిక అయిన తర్వాత స్కైవర్-బ్రంట్ స్పందించింది. ఇంగ్లండ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. నేను ఎంతో అభిమానించే చార్లెట్ ఎడ్వర్డ్స్ సూచన మెరకు నా ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనున్నాను. 2013లో అరంగేట్రం నుంచి ఇంగ్లండ్ క్రికెట్‌కు నా వంతు సహకారం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. జట్టును విజయపథంలో నడిపించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను అని బ్రంట్ ఓ ప్రకటనలో పేర్కొంది. స్కైవర్-బ్రంట్‌కు కెప్టెన్‌గా అనుభవం ఉంది. హీథర్ నైట్ గైర్హాజరీలో 11 టీ20ల్లో ఇంగ్లండ్ జట్టుకు సారథ్యం వహించింది.



# అప్పుడు థ్రిల్లర్.. ఇప్పుడు హారర్

తెలుగులో చాలామంది హీరోలు ఉన్నారు. వాళ్లలో ఒకడు బెల్లంకొండ శ్రీనివాస్. పదేళ్లకు పైనే ఇండస్ట్రీలో ఉన్నాడు కానీ చెప్పుకోదగ్గ సినిమాలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. చివరగా 2023లో ఛత్రపతి చిత్రాని హిందీలో రీమేక్ చేసి ఘోరంగా ఫెయిలయ్యాడు. దీంతో చాలా గ్యాప్ తీసుకుని ఒకేసారి నాలుగు సినిమాల్ని రెడీ చేస్తున్నాడు. అందులో 'భైరవం' త్వరలో రిలీజ్ అవుతుంది. ఇప్పుడు 'కిష్కిందపురి' అని మరో మూవీ ప్రకటించాడు. తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు. పాడుబడ్డ పెద్ద భవంతి, అందులో హీరో అండ్ గ్యాంగ్ వెళ్తారు. తర్వాత ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనే అంశాలతో ఈ 'కిష్కిందపురి' తీసినట్లు అనిపిస్తుంది. గతంలో బెల్లంకొండ హీరోతో 'రాక్షసుడు' సినిమాలో నటించిన అనుపమ.. ఇందులో హీరోయిన్. తొలిసారి హారర్ జానర్ సినిమాతో బెల్లంకొండ శ్రీనివాస్ రాబోతున్నాడు. ఈ వర్షాకాలంలోనే మూవీ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. కౌశిక్ పెగళ్లపాటి దర్శకుడు. మరి ఈసారైనా బెల్లంకొండ హిట్ కొడతాడా? ఈ గ్లింప్స్ చూస్తుంటే విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. చివర్లో హీరో... అహం మృత్యు అని చెప్పిన డైలాగ్, ఆ టైంలో కళ్లు దెయ్యం కళ్లలా ఉండటం చూస్తుంటే ఈసారి ప్రేక్షకుల్ని భయపెడతారనిపిస్తోంది. గతంలో అనుపమతో థ్రిల్లర్ మూవీ చేయగా.. ఇప్పుడు హారర్ చేశాడు శ్రీనివాస్.

# అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా నుంచి కీలకమైన అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా ఎన్టీఆర్ ప్రకటించారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో పీరియాడికల్ స్టోరీతో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది . ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏప్రిల్ 22 నుంచి షూటింగ్‌లో ఎన్టీఆర్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'దేవర' తర్వాత ఎన్టీఆర్.. 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ ఇలా ఇద్దరూ తెలుగులో కలిసి చేస్తున్న చిత్రమిదే కావడంతో అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అభిమానులకు ఎన్టీఆర్ శుభవార్త చెప్పారు. చిత్రాన్ని 2026 జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా మే 20న ఈ మూవీ నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇద్దరు డైనమిక్ వ్యక్తుల కాంబినేషన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విధ్వంసమే జరగనుంది. ఆ అనుభూతి పొందేందుకు సిద్ధకండి అంటూ మైత్రీ మూవీ మేకర్స్ పేర్కొంది. వచ్చే సమ్మర్‌లో బాక్సాఫీస్ వద్ద ఫుల్ సందడి వాతావరణం కనిపించడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. ప్రస్తుతం కర్ణాటకలో ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. మొదట వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే, కథ వల్ల వీఎఫ్ఎక్స్ పనులతో పాటు చిత్రీకరణ విషయంలోనూ మరింత స్ట్రాంగ్‌గా ప్లాన్ చేయడం వల్లే కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు కూడా మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ విషయానికి వస్తే.. తారక్ నటిస్తోన్న 31వ చిత్రమిది. షూటింగ్‌లో భాగంగా కొద్దిరోజుల క్రితమే రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్డ్ కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేసి అక్కడ కొన్ని సీన్స్ చిత్రీకరించారు. ఇప్పటికే చాలా వరకు షూటింగ్ పనులు కూడా పూర్తి అయ్యాయి. అయితే, ఎన్టీఆర్‌తో తెరకెక్కించబోయే సీన్లు మాత్రం కాస్త ఆలస్యంగా ప్రారంభించారు. శ్రీలంకలోని కొలంబోలో కూడా ఎన్టీఆర్‌తో షూటింగ్ షెడ్యూల్స్ ఉన్నాయి. ఆల్రెడీ యూనిట్‌లోని కీలక సాంకేతిక నిపుణులు కొలంబో వెళ్లి, అక్కడి లొకేషన్స్‌ను ఫైనల్ చేశారని తెలిసింది.



# ఏడాది తర్వాత..
# మరో ఓటీటీలోకి కామెడీ ఎంటర్‌టైనర్..

శ్రీవిష్ణు కథానాయకుడిగా శ్రీహర్ష కొనుగంటి తెరకెక్కించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓం భీమ్ బుష్' గతేడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఆడియన్స్‌కు నవ్వులు పంచి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉన్న ఈ సినిమా ఇప్పుడు మరో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చేస్తోంది. సింప్లీ సౌత్ వేదికగా మే 2 నుంచి ప్రసారం కానుంది. శ్రీవిష్ణుతో పాటు ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రలు పోషించిన ఇందులో ప్రీతి ముకుందన్, అయేషాఖాన్, ఆదిత్య మీనన్ తదితరులు నటించారు.

కథేంటంటే: లెగసీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులు బ్యాంగ్ బ్రదర్స్ క్రిష్ (శ్రీవిష్ణు), వినయ్ గుమ్మడి (ప్రియదర్శి), మ్యాడీ రేలంగి (రాహుల్ రామకృష్ణ). వీళ్లు చేసే పనులు భరించలేక తక్కువ సమయంలోనే ముగ్గురికీ డాక్టరేట్లు ఇచ్చి పంపించేస్తారు కళాశాలలోని ప్రొఫెసర్. దాంతో వీరు భైరవపురం చేరుకుంటారు. ఏ టు జెడ్ సర్వీసెస్ పేరుతో ఓ దుకాణం తెరిచి ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం చూపిస్తామని ప్రచారం చేసుకుంటారు. కానీ ఈ ముగ్గురూ ఊరి జనాల్ని బురిడీ కొట్టిస్తున్నారనే విషయం బయటపడుతుంది. దాంతో ఊరి సర్పంచ్ ఓ పరీక్ష పెడతారు. సంపంగి మహల్‌లో ఉన్న నిధిని కనిపెట్టి తీసుకొస్తే వారిని నమ్ముతామని చెబుతారు. దెయ్యం ఉన్న ఆ మహల్‌లోకి నిధి కోసం వెళ్లాక ఈ బ్యాంగ్ బ్రదర్స్‌కి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఇంతకీ ఆ మహల్‌లో ఉన్న సంపంగి దెయ్యం కథేమిటి?అనేది సినిమాలో చూపించారు.

## రాజమౌళి సినిమా కోసం
## మరీ ఇంత చేంజా!

సూపర్ స్టార్ మహేష్ బాబు టాలీవుడ్ స్టార్ హీరోలలో ఒకరు. ఆయన గ్లామర్‌కి ఎవరైన ఫిదా కావల్సిందే. కృష్ణ నటవారసుడిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మహేష్ తనదైన నటనతో స్టార్ హీరోగా ఎదిగాడు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు తన 29వ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇండియన్ సినిమా చరిత్రలోనే రాజమౌళి ఈ చిత్రాన్ని అత్యంత భారీ చిత్రంగా రూపొందిస్తున్నారు. ఏకంగా 1000 కోట్ల బడ్జెట్ లో ఈ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ మూవీతని ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్ చిత్రంగా రాజమౌళి అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. అయితే రాజమౌళి సినిమాలో హీరో లుక్ గత సినిమాల కన్నా భిన్నంగా ఉంటుందనే విషయం మనకు తెలిసిందే. ఇప్పుడు మహేష్ బాబు లుక్ ఎలా ఉంటుందనే చర్చ గత కొన్ని రోజులుగా నడుస్తుంది. ఈ క్రమంలో మహేష్ బాబు లేటెస్ట్ లుక్ లీక్ అయింది. ఇందులో హెయిర్, గడ్డం పొడవుగా కనిపిస్తున్నాయి. లేటెస్ట్ లుక్ మాత్రం ఫ్యాన్స్ కి షాకింగ్ గా ఉంది.



# నితిన్‌కి 'ఎల్లమ్మ' కష్టాలు!

'బలగం' తర్వాత దర్శకుడు వేణు చాలా గ్యాప్ తీసుకున్నాడు. తన రెండో సినిమా 'ఎల్లమ్మ' అని ప్రకటించి చాలా రోజులైంది కానీ, ఇంకా పట్టాలెక్కలేదు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో తొలుత నాని హీరోగా నటిస్తారనే ప్రచారం జరిగింది. నాని కూడా వేణుతో సినిమా చేస్తానని చెప్పారు. ఏం జరిగిందో తెలియదు కానీ నాని ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పకున్నాడు. చివరకు ఈ కథ అటు తిరిగి ఇటు తిరిగి నితిన్ దగ్గర వెళ్లింది. కథ బాగా నచ్చడంతో నితిన్ ఈ చిత్రాన్ని వెంటనే ఓకే చేశాడు. డేట్స్ కూడా అరేంజ్ చేసుకున్నాడు. నిర్మాత దిల్ రాజు కూడా సినిమా షూటింగ్ స్టార్స్ చేసేందుకు రెడీగా ఉన్నాడు. కానీ ఈ సినిమాకు కీలకమైన హీరోయిన్ మాత్రం దొరకడం లేదట. 'ఎల్లమ్మ' కోసం అటు దిల్ రాజు, నితిన్.. ఇటు వేణు తెగ వెతుకుతున్నారట. బలగం మాదిరే ఈ కథ కూడా రూరల్ నేపథ్యంలోనే సాగుతుదంట. దర్శకుడు వేణు చాలా పకడ్బంధీగా ఈ సినిమా స్క్రిప్ట్ రెడీ చేసుకున్నాడట. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకి చాలా ప్రాధాన్యత ఉంటుందట. కథ మొత్తం ఆమె చుట్టునే తిరుగుతుంది. అందుకే ఓ స్టార్ హీరోయిన్‌ని ఆ పాత్రకు తీసుకోవాలనుకున్నారట. తొలుత సాయి పల్లవి అయితే బాగుంటుందని ఆమెను సంప్రదించారు. అయితే సాయి పల్లవి ఈ సినిమా చేయలేనని చెప్పేసిందట. దీంతో మరో స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ అయితే 'ఎల్లమ్మ'కు న్యాయం చేస్తుందని ఆమెను సంప్రదించారట. అయితే కథ, పాత్ర బాగా నచ్చినప్పటికీ.. డేట్స్ ఖాళీగా లేకపోవడం నో చెప్పేసిందట. శ్రీలీలను తీసుకుందామంటే.. అల్రెడీ నితిన్‌తో రెండు సినిమాలు చేసింది. అవి కూడా ఫ్లాప్ అవ్వడంతో దిల్ రాజు వెనకడుకు వేస్తున్నాడట. ఇక రష్మిక, సమంత లాంటి హీరోయిన్లు కూడా ఖాళీగా లేరు. నితిన్ ఎప్పుడైన తన సినిమాలకు ట్రెండింగ్ హీరోయిన్‌ని తీసుకుంటాడు. కానీ ఈ సారి మాత్రం అది వర్కౌట్ అయ్యేలా లేదు. స్టార్ హీరోహీరోయిన్లు అంతా బిజీగా ఉన్నారు. మరి 'ఎల్లమ్మ'గా ఎవరు ఎంట్రీ ఇస్తారో చూడాలి.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com